

అందం.. అఖండం

గుడిమెట్ల ప్రాంతానికి పూర్వవైభవం

అఖండ-2 సినిమా షూటింగ్ కోసం పరిశీలన

- దర్శకుడు బోయపాటి రాకతో వార్తల్లోకి..
- శతాబ్దాల చరిత్ర కలిగిన పర్యాటక ప్రాంతం
- కృష్ణానది ఒంపుసొంపులు ప్రత్యేక ఆకర్షణ
- నిత్యం నిండుకుండలా కృష్ణమ్మ ప్రవాహం

కథనం 6లో




ఆ ప్రాంతం.. చరిత్ర తెలిపే ఏడు కోటలకు ఎత్తయిన నిదర్శనం.. ఏడు పేటల ప్రజల ఆరాధ్య నిలయం.. ఇక్కడి శివకేశవ ఆలయాలు ఆధ్యాత్మికతకు ఆలవాలం.. కృష్ణమ్మ ఒంపుసొంపులకు, కనువిందు చేసే ప్రకృతి రమణీయతకు ఇది అందాల కేంద్రం.. శతాబ్దాల చరిత్ర కలిగి, అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయిన చందర్లపాడు మండలంలోని గుడిమెట్ల క్షేత్రానికి పూర్వవైభవం రానుందా? నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా అఖండ-2 చిత్ర నిర్మాణ నేపథ్యంలో దర్శకుడు బోయపాటి శ్రీనివాసరావు దృష్టి గుడిమెట్ల ప్రాంతంపై పడటంతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి పర్యాటకంగా పేరు తేవాలని కూటమి ప్రభుత్వం యోచిస్తోంది.

● ముంచేసిన మంచు



బారెడు పొద్దెక్కినా పొగమంచు వీడట్లేదు. ఉదయం 10 గంటలవుతున్నా మంచు దుప్పటి తొలగట్లేదు. రెండు, మూడు రోజులుగా పరిస్థితి మరింత భయంకరంగా మారింది. పాఠశాలలు, కళాశాలలు, ఆఫీసులకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దగ్గరకు వచ్చే వరకు ఎదుటి వాహనాలు కనిపించకపోవటంతో అవస్థలు పడుతున్నారు. ఇక తెల్లవారుజామున మంచు వర్షంలా కురుస్తోంది. ఓవైపు వాహనదారులు దారి కనిపించక అవస్థలు పడుతుంటే, మరోవైపు ప్రకృతి ప్రేమికులు కొత్త అందాలను ఆస్వాదిస్తున్నారు. (కూచిపూడిలోని ప్రధాన రహదారిలో పరిస్థితి ఇదీ..)

- కూచిపూడి, ఆంధ్రజ్యోతి

మడమ తిప్పరు..!

మడ అడవులపై మళ్లీ అక్రమార్కుల కన్ను

బందరు మండలం కానూరులో ఆక్రమణ యత్నాలు

అక్రమార్కులు విడతలవారీగా మడ అడవులపై కన్నేస్తున్నారు. బందరు మండలం కానూరు గ్రామ పరిధిలో ఈ వ్యవహారాలు గుట్టుగా జరుగుతున్నాయి. నవంబరులోనే మడ అడవుల ఆక్రమణకు ఓ వ్యక్తి ప్రయత్నించగా అధికారులు అడ్డుకున్నారు. రెండు రోజులుగా అదే వ్యక్తి మళ్లీ అడవుల్లోని చెట్లను నరికి వేస్తుండటంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- ● నవంబరులోనే ప్రయత్నం.. అడ్డుకున్న యంత్రాంగం
- ● రెండు నెలల తరువాత మళ్లీ రంగంలోకి..
- ● రెండు రోజులుగా చెట్ల నరికివేత పనులు
- ● రెవెన్యూ అధికారులకు స్థానికుల ఫిర్యాదు
- ● కన్నెత్తి కూడా చూడని అధికార యంత్రాంగం



బందరు మండలం కానూరు గ్రామంలోని మడ అడవుల్లో చెట్ల నరికివేత

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో సముద్రతీరంలోని గ్రామాలకు రక్షణ గోడగా ఉండే మడ అడవుల భూములను ఆక్రమించే యత్నాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. బందరు మండలం కానూరు రెవెన్యూ గ్రామ పరిధిలోని మడ అడవులు ఏపుగా ఉన్న ప్రాంతంలో చెట్లను నరికి ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు నాలుగు రోజులుగా కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారు. అయినా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడట్లేదు. కానూరులోని ప్రభుత్వ భూముల్లో సహజసిద్ధంగా పెరిగిన మడచెట్లను యంత్రాల ద్వారా కోసేసి, ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గత ఏడాది నవంబరులో ఈ ప్రాంతంలోని మడభూములను కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేయగా, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. రెండు నెలల విరామం అనంతరం మళ్లీ ఆక్రమణలు ప్రారంభమయ్యాయి.

70 ఎకరాలకుపైగా ఆక్రమించే యత్నం

బందరు మండలం కానూరు రెవెన్యూ గ్రామ పరిధిలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. లజ్జబండ డ్రెయినేజీ పక్కనే ఉన్న ఈ భూమిలో మడ అడవులు ఉన్నాయి. బంటుమిల్లి మండలం మణిమేశ్వరానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల కాలంలో ఈ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. 70 ఎకరాల భూమిలోని మడచెట్లను నరికివేయించే పనులు చేయిస్తున్నాడు. ఈనెల 22, 23 తేదీల్లో ఆటోల్లో కూలీలను తీసుకొచ్చి మరీ మడచెట్లు నరికే పనులు చేయించాడు. గురువారం పనులు నిలిపివేసి, శుక్రవారం మళ్లీ మొదలుపెట్టాడు. ఈ అంశంపై స్థానికులు స్థానిక వీఆర్వోకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా మడచెట్ల నరికివేతను ఆపేందుకు రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

తొలుత ఆక్రమణ.. ఆ తర్వాత లీజుకు..

కానూరు, పెదపట్నం గ్రామాల్లోని మడ అడవులను ఐదు, పది ఎకరాల చొప్పున రొయ్యల చెరువులుగా మార్చేసిన అనంతరం ఈ భూములు తమకు చెందినట్లుగా ఆక్రమణదారులు చూపిస్తారు. కొంతకాలం తరువాత ఆ ప్రభుత్వ భూములను భీమవరానికి చెందిన బడాబాబులకు లీజుకిచ్చి ఏడాదికి ఎకరాకు రూ.70 వేల నుంచి రూ.80 వేల చొప్పున వసూలు చేస్తారు. ఈ ఆనవాయితీ కొన్నేళ్లుగా జరుగుతోంది. ఇదే ఆనవాయితీని మణిమేశ్వరానికి చెందిన వ్యక్తి అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించాడని స్థానికులు చెబుతున్నారు.

రొయ్యల సాగుకు అనుకూలమనే..

కానూరు-పెదపట్నం గ్రామాల మధ్యగా లజ్జబండ డ్రెయినేజీ ప్రవహిస్తుంది. అక్కడి నుంచి సముద్రంలో కలుస్తుంది. కానూరు రెవెన్యూ గ్రామ పరిధిలో లజ్జబండ డ్రెయినేజీకి ఇరువైపులా ప్రభుత్వ భూముల్లో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. ఇక్కడ సముద్రం నుంచి ఉప్పునీరు లజ్జబండ డ్రెయినేజీ ద్వారా వచ్చి వెళ్తుంటుంది. దీంతో ఈ ప్రాంతం రొయ్యల సాగుకు అనుకూలంగా మారింది. ఈ ప్రాంతంపై మణిమేశ్వరానికి మిగతా 6లో..

మోటెల్ రగడ

ఏపీటీడీసీ వర్సెస్ చాంపియన్స్

- కృష్ణవేణి మోటెల్ లీజును రద్దు చేయాలని కొందరు అధికారుల వాదన
- లీజు పొందాక గోడలు కూల్చటం, చెట్ల నరికివేతపై ఆగ్రహం
- అభివృద్ధి కోసమే అలా చేశామంటున్న చాంపియన్స్ నిర్వాహకులు
- ఏపీటీడీసీ చైర్మన్ సమావేశంలో హాట్‌హాట్‌గా చర్చ
- లీజు నిబంధనలను అతిక్రమించటంపై విమర్శలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)లో కృష్ణవేణి మోటెల్ రగడ పెద్దదవుతోంది. ప్రకాశం బ్యారేజీ దగ్గర ఉన్న కృష్ణవేణి మోటెల్‌ను 'చాంపియన్స్ యాచ్ క్లబ్' అనే సంస్థకు ఏడు నెలల కిందట లీజుకిచ్చారు. వైసీపీ హయాంలో పనిచేసిన అధికారులు చాంపియన్స్ సంస్థకు కారుచౌకగా దీనిని కట్టబెట్టారని ఏపీటీడీసీలోని కొంతమంది అధికారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వానికి పూర్తిగా తెలియకుండా హడావిడిగా ఈ పని చేశారని వాదిస్తున్నారు. ఇటీవల ఏపీటీడీసీ బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ నిర్వహించిన సమావేశంలో కృష్ణవేణి మోటెల్ అంశం హాట్ టాపిక్‌గా మారింది. చాంపియన్ యాచ్ క్లబ్‌కు ఇచ్చిన లీజు రద్దు చేయాలని ఓ వర్గం వాదించగా, మరోవర్గం సమర్థించింది. దీంతో చైర్మన్ నూకసాని ఈ ఫైల్‌ను పరిశీలించారు. అక్కడి నిర్మాణాలను కూల్చటంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఏపీటీడీసీ భవనం గోడలను, ఇతర నిర్మాణాలను కూల్చటం, చుట్టూ గోడల ఎత్తు పెంచటం, కృష్ణానది ఒడ్డున ఆహ్లాదకరంగా ఉండే వాతావరణాన్ని దెబ్బతీసేలా చెట్లను నరకటం వంటివి క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్వాహకులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. లీజు ఒప్పందాలకు భిన్నంగా వ్యవహరించారని మండిపడ్డారు. దీనిపై కొందరు ఉద్యోగులు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. చాంపియన్స్ సంస్థ లీజు రద్దు చేయాలని కోరారు. నెలకు కేవలం రూ.లక్షన్నరకే లీజుకివ్వడం ద్వారా వచ్చే లాభమేమీ ఉండదని చైర్మన్‌కు విన్నవించారు. ఏపీటీడీసీ నిర్వహించినా అంతకుమించి ఆదాయం వస్తుందని చెప్పారు. కాగా, ఈ మోటెల్‌ను శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా, నిర్మాణాల మార్పు చేర్పుల దృశ్యాలు కనిపించాయి. చాంపియన్స్ యాచ్ క్లబ్ నిర్వాహకుల వాదన మరోలా ఉంది. పర్యాటకంగా అభివృద్ధి చేయటానికే విస్తరణ పనులు చేస్తున్నామని వారు పేర్కొంటున్నారు. చిన్నపాటి నిర్మాణాలను కూల్చడం వల్ల విశాలమైన ఓపెన్ కన్వెన్షన్ ఏరియా వస్తుందంటున్నారు. ఇంజనీరింగ్ అధికారుల సూచన మేరకు గోడల ఎత్తు పెంచుతున్నామని చెబుతున్నారు. తుప్పుపట్టిన నిర్మాణాలను తొలగించి కొత్తగా అభివృద్ధి చేస్తున్నామని వారు పేర్కొంటున్నారు.

2 నుంచి మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరుడి వార్షిక బ్రహ్మోత్సవాలు


6లో

జంప్ డిపాజిట్.. ఖాతాలు ఖాళీ

సైబర్ నేరాల్లో కొత్త ట్రెండ్

- జంప్ డిపాజిట్ పేరుతో టోకరా
- తొలుత గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా డబ్బు జమ
- పొరపాటున వచ్చిందంటూ ఖాతాదారులకు ఫోన్లు
- లింక్ ద్వారా వెనక్కి పంపాలంటూ విజ్ఞప్తులు
- ఆ క్రమంలో ఖాతాల వివరాల సేకరణ
- క్రమంగా ఖాతాల్లో డబ్బంతా దోపిడీ

సైబర్ నేరగాళ్లు సరికొత్త దారులు వెతుకుతున్నారు. నిన్నటివరకు 'డిజిటల్ అరెస్టు'తో అటు పోలీసులను, ఇటు ప్రజలను హడలెత్తించిన నేరగాళ్లు.. తాజాగా 'జంప్ డిపాజిట్' పేరుతో ఖాతాలు ఖాళీ చేసేస్తున్నారు. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ కేసులు నమోదు కాకపోయినా.. హైదరాబాద్‌లో ఈ తరహా నేరాలు జరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రజల్లో వస్తున్న చైతన్యం, పోలీసుల అప్రమత్తతతో డిజిటల్ అరెస్టులకు బ్రేక్ పడి సైబర్ నేరగాళ్లకు ఆదాయం పడిపోయింది. దీంతో జంప్ డిపాజిట్ పేరుతో మరో మార్గాన్ని ఎంచుకున్నారు. ఈ తరహా కేసులు ఇప్పటికే హైదరాబాద్‌లో నమోదయ్యాయి. మన నగరంలో ఇప్పటి నుంచే మేల్కొనకపోతే భవిష్యత్తులో దారుణాలు వెలుగుచూసే అవకాశముంది.

జంప్ డిపాజిట్ అంటే..

ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం అనేక విషయాలను చాలా సులభతరం చేసింది. ఇందులో ప్రధానమైనది డిజిటల్ పేమెంట్స్. ఒకప్పుడు ఏదైనా వస్తువు కొనాలంటే డబ్బు ఇచ్చుకునేవారు. ఇప్పుడు ఈ పరిస్థితి ఉన్నప్పటికీ డిజిటల్ చెల్లింపులే ఎక్కువగా జరుగుతున్నాయి. ఎంత చిన్న మొత్తం మిగతా 6లో..

● మిస్సింగ్ మిస్టోరీలు

అదృశ్యం వెనుక..

సాంకేతికథలు

- బెజవాడలో మైనర్ అమ్మాయిల మిస్సింగ్‌లు
- సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడిగా చాటింగ్‌లు
- రీల్స్ పిచ్చిలో అమ్మాయిల వింత పోకడలు
- వల వేసి లాగుతున్న పరాయి యువకులు
- ఇంట్లో వారికి తెలియకుండా బయటి ప్రాంతాలకు..
- అజిత్‌సింగ్‌నగర్, నున్న పీఎస్‌ల్లోనే ఎక్కువ
- ముగ్గురు మైనర్లను తెనాలిలో పట్టుకున్న పోలీసులు




● పాఠశాల పూర్తయ్యాక కూడా ఓ బాలిక ఇంటికి రాలేదు. ఎంత వెతికినా తల్లిదండ్రులకు ఆచూకీ తెలియలేదు. తోటి విద్యార్థులను విచారిస్తే స్నేహితులతో కలిసి బయటకు వెళ్లినట్టు తేలింది. నగరంలో కొద్దిరోజుల క్రితం జరిగిన ఘటన ఇది.

● మదర్సాలో చదువుకున్న బాలిక కొద్దికాలంగా ఇంటి వద్ద ఉంటోంది. ఆమెకు ఇన్‌స్టాలో ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. ఆ యువకుడికి చెందిన మరో ఇద్దరు స్నేహితులు, ఆ బాలికకు చెందిన మరో ఇద్దరు స్నేహితురాళ్లకు పరిచయం ఏర్పడింది. ఆ యువకుల మాటలు నమ్మిన ఈ ముగ్గురు అమ్మాయిలు నగరం దాటేశారు. తాజాగా జరిగిన ఘటన ఇది.

.. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటున్న అమ్మాయిలు ఇలా విపరీత పోకడలకు వెళ్తున్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను అడియాసలు చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల మోజులో పడి ఉజ్వల భవిష్యత్తును రోడ్డున పడేసుకుంటున్నారు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఉత్తర మండలంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ఈ మండలంలో సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న పోలీస్‌స్టేషన్లు ఉండగా, నెలకు 50కు పైగా మిస్సింగ్ కేసులు నమోదవుతుండటం గమనార్హం.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 'పాఠశాలకు వెళ్లిన మా అమ్మాయి ఇంకా ఇంటికి తిరిగిరాలేదు.', 'స్నేహితురాళ్లతో బయటకు వెళ్లిన అమ్మాయి కనిపించడం లేదు.' అజిత్‌సింగ్‌నగర్, నున్న పోలీస్‌స్టేషన్లకు ఎక్కువగా అందుతున్న ఫిర్యాదులివి. ఈ తరహా ఘటనలకు సంబంధించి ఈ రెండు పోలీస్‌స్టేషన్లకు నెలకు 50కి పైగా ఫిర్యాదులు వస్తున్నాయని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. అజిత్‌సింగ్‌నగర్, నున్న పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రజల జీవన స్వరూపం భిన్నంగా ఉంటుంది. ఈ రెండు పీఎస్‌ల పరిధిలో విలాసవంతమైన కాలనీలు పెద్దగా ఉండవు. మిగిలిన కాలనీలన్నీ కూలీలు, మధ్యతరగతి వర్గాలకు చెందినవే. ప్రతి కుటుంబం నుంచి తల్లిదండ్రులు నిత్యం ఉదయం ఇంటి నుంచి ఏదో ఒక పనికి బయల్దేరి వెళ్తారు. కొంతమంది పిల్లలను ఇళ్ల వద్దే వదులుతారు. ఇంకొంతమంది పిల్లలను పాఠశాలలకు పంపుతుంటారు. ఈ పిల్లలకు స్మార్ట్‌ఫోన్లను ఇచ్చి తల్లిదండ్రులు ఉపాధికి వెళ్తుంటారు. ఆండ్రాయిడ్ ఫోన్లు అరచేతిలో ఉండటంతో వారు సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా, స్నాప్‌చాట్, షేర్‌చాట్ వంటి యాప్‌ల్లో వీడియోలను పోస్టు చేస్తున్నారు. ప్రతి పనినీ రీల్స్ చేసి ఇన్‌స్టా, స్నాప్‌చాట్‌ల్లో పోస్టు చేస్తున్నారు. అందులో ఉన్న లైక్‌లను చూసి మురిసిపోతున్నారు. నెటిజన్లు చేసిన కామెంట్లతో మరిన్ని రీల్స్ చేస్తున్నారు. రీల్స్ మాయలో అవతలి వ్యక్తులు పంపిన రిక్వెస్టులను అంగీకరిస్తున్నారు. వారిని ఫాలో అవుతున్నారు. రిక్వెస్టులు పంపిన వ్యక్తులు ఎవరో మిగతా 6లో..

ఫిబ్రవరి 2 నుంచి సుబ్రహ్మణ్యేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలు



మోపిదేవి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 2 నుంచి అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. 2వ తేదీ ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ స్వామి, అమ్మవార్లకు దేవదాయ శాఖ అనువంశిక ధర్మకర్తలైన చల్లపల్లి రాజా వంశీయుల తరపున నూతన పట్టువస్త్రాలను సమర్పించగా, స్వామివారిని పెండ్లి కుమారుడిని చేయుటతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కళ్యాణ బ్రహ్మోత్స వాలు పురస్కరించుకుని 3వ తేదీ రాత్రి 9 గంటలకు మయసభ దుర్యోధనుడి ఏకపాత్రాభినయం, శ్రీరామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, 4వ తేదీ సత్యహరిశ్చంద్ర, 5వ తేదీ రావివారిపాలెంలో బాల నాగమ్మ నాటకం ఉంటాయన్నారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని 2 నుంచి 7వ తేదీ శుక్రవారం వరకు స్వామివారి నిత్య అర్జిత సేవలను తాత్కాలికంగా నిలుపుదల చేయనున్నట్టు తెలిపారు.



ధర్మసత్రాన్ని పరిశీలిస్తున్న శ్రీరామవరప్రసాదరావు

తమ్మన పిచ్చయ్య ధర్మసత్రం స్వాధీనం

మచిలీపట్నం టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం బలరామునిపేటలోని తమ్మన పిచ్చయ్య ధర్మసత్రాన్ని దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. కొంతకాలంగా ఈ సత్రం స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కృష్ణా జిల్లా ఎండోమెంట్స్ ఇన్‌చార్జి కమిషనర్, మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థాన డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామవరప్రసాద్, రెవెన్యూ, పోలీసు అధికారులు, సత్రం కార్యనిర్వహణాధికారి గోవాడ వెంకటకృష్ణారావులు ధర్మసత్రాన్ని పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు పంచనామా చేశారు. 110 ఏళ్ల క్రితం అపర ఖర్మలకు ఉపయోగించే ఈ సత్రం ఆక్రమణకు గురయ్యే పరిస్థితి రావడంతో ఈ స్థలాన్ని స్వాధీనపరుచుకున్నట్టు శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. ఈ సత్రాన్ని పునర్నిర్మిస్తామన్నారు. మెయిన్‌రోడ్డు పక్కన 616 గజాల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారులు ఆంజనేయస్వామి, కొండలరావు, శ్రీనివాసరావు, పి.వి.ఎన్.వి. ప్రసాద్, వై.శిరీష, కగ్గా శ్రీనివాసరావులు పాల్గొన్నారు.



చెక్‌పోస్టు - పెదలింగాల రహదారి

రహదారి నిర్మాణాల్లో డొల్లతనం

- చిత్రీకరణకు వెళ్లిన విలేకరిపై సబ్ కాంట్రాక్టర్ కుమారుడి దురుసు ప్రవర్తన
- ఫోన్ లాక్కుని హంగామా.. బెదిరింపులు

గుడివాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రహదారి నిర్మాణంలో నాణ్యత కొరవడిందని, రోడ్డు పక్కన గ్రావెల్‌కు బదులుగా నల్లమట్టి వేస్తున్నారని రైతులు సమాచారం ఇవ్వడంతో వార్త సేకరణకు వెళ్లిన నందివాడ 'ఆంధ్రజ్యోతి' విలేకరి నత్తా ఏడుకొండలుపై సబ్ కాంట్రాక్టర్ వీర్ల వెంకటేశ్వరరావు కుమారుడు దురుసుగా ప్రవర్తించాడు. ఫోన్ లాక్కుని హంగామా సృష్టించాడు, కాంట్రాక్టర్ ఎవరో తెలుసుకుని రావాలని, మరోసారి వస్తే అంతు చూస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. నందివాడ మండలం చేదుర్తిపాడు-చినలింగాల, చెక్‌పోస్టు-పెదలింగాల రహదారుల నిర్మాణంలో డొల్లతనం ఉందని, నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, రహదారికి ఇరువైపులా రహదారి పటిష్టతకు గ్రావెల్ వాడాలి. దానికి బదులు పక్కనే ఉన్న కాలువలోని నల్లమట్టిని తవ్విపోస్తున్నారని పలుమార్లు రైతులు అభ్యంతరం తెలిపినా కాంట్రాక్టర్ పట్టించుకోలేదు. దీంతో స్థానిక రైతులు 'ఆంధ్రజ్యోతి' విలేకరిని సంప్రదించారు. వార్త సేకరణకు వెళ్లిన విలేకరి ఏడుకొండలు పట్ల టిప్పర్ వేసుకొచ్చిన సబ్ కాంట్రాక్టర్ కుమారుడు దురుసుగా ప్రవర్తించి, బలవంతంగా సెల్‌ఫోన్‌ను లాక్కున్నాడు. విలేకరులైతే ఏంటి, కాంట్రాక్టర్ ఎవరో తెలుసుకుని రావాలని దాదాపుగా గంటపాటు వాగ్వివాదానికి దిగాడు. కాసేపటికి వివాదం సద్దుమణిగింది. అటుగా వచ్చిన రైతులు టిప్పర్ వేసుకొచ్చిన సబ్ కాంట్రాక్టర్ కుమారుడి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఢిల్లీలో గణతంత్ర వేడుకలకు గుడివాడ విద్యార్థి



గుడివాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో జరిగే 76వ గణతంత్ర వేడుకలకు గుడివాడ ఏకేటీపీ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి గోపిశెట్టి సిరికి ఆహ్వానం అందినట్టు డీవైఈవో ఐ.పద్మారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణతంత్ర వేడుకలకు ఆంధ్ర, తెలంగాణ డైరెక్టరేట్ జూనియర్ వింగ్ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్టు తెలిపారు. ఎన్‌సీసీ ట్రూప్‌లో 4వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్‌లో సిరి పేరు నమోదు చేసుకోవడంతో జూలై నెలలో జరిగిన రిపబ్లిక్ డే పెరేడ్ సెలక్షన్‌లో పాల్గొని అర్హత సాధించినట్టు తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రవికుమార్

సాంకేతిక ఆవిష్కరణలు జరగాలి

- మంత్రి గొట్టిపాటి రవికుమార్

పెనమలూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమలు, విద్యారంగాల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణల పాత్ర కీలకమని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో రీసెర్చ్ కాంక్లేవ్-2025 ఇండస్ట్రీ అకడమిక్ మీట్ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ, విద్యావేత్తలు, పారిశ్రామిక దిగ్గజాలను ఒకే వేదికపైకి తెచ్చి పరిశ్రమల అభివృద్ధిలో విద్యారంగం, నూతన ఆవిష్కరణల పాత్రను క్షుణ్ణంగా వివరించే ప్రయత్నం గొప్ప విషయమన్నారు. పరిశ్రమ-విద్యారంగ సమన్వయంపై మరిన్ని చర్చలు జరగాలన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించారు. షరీఫ్ మహమ్మద్ అహ్మద్‌ను సన్మానించారు. ప్రో వీసీ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, వీసీ డాక్టర్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి పి.లక్ష్మణరావు, అధ్యక్షుడు ఎం.రాజయ్య, డీన్ ఎం.సునీత, అనురాధ పాల్గొన్నారు.

అందం.. అఖండం

గుడిమెట్లలో అఖండ-2 సినిమా కోసం లోకేషన్ల పరిశీలన

చుట్టూ కొండలు..మధ్యలో కృష్ణమ ఒంపుసొంపులు



పురాతన ద్వారకా వేంకటేశ్వరస్వామి ఆలయం

- కనువిందు చేసే గ్రామ అందాలు
- ఏడు కోటలు..ఏడు పేటలు..ఆలయాలు.. రాచరికపు పాలనతో వెలుగొందిన గ్రామం
- ప్రకాశం బ్యారేజీలో నీరు తగ్గినా..ఇక్కడ పుష్కలం

ఏడు కోటలు..ఏడు పేటలు..ఆలయాలు.. ఆధ్యాత్మిక కేంద్రాలు.. రాజులు.. రాజరికపు పాలనతో కృష్ణానది ఒడ్డున ఒక వెలుగు వెలిగిన గుడిమెట్ల గ్రామానికి అలనాటి వైభవం మళ్లీ తిరిగి రానుందా.. కృష్ణానది ఎండని ప్రాంతంగా..సహజ ప్రకృతి సౌందర్యంతో పర్యాటక స్వర్గధామమైన గుడిమెట్లకు మళ్లీ తగిన గుర్తింపు, పునర్వైభవం రాబోతోందా..అఖండ-2 సినిమా షూటింగ్ కోసం ఇక్కడి అందమైన లొకేషన్లను పరిశీలిస్తుండటంతో పర్యాటకంగా, సాంస్కృతికంగా, చారిత్రకంగా ఎంతో ప్రాశస్త్యం కలిగిన గుడిమెట్ల మళ్లీ ప్రాభవానికి నోచుకోబోతోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. నటుడు నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీనివాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న అఖండ-2 చిత్రీకరణఇక్కడ జరిగే అవకాశం ఉండటంతో గుడిమెట్ల ప్రాశస్త్యానికి మళ్లీ జీవం రాబోతోందనిపిస్తోంది. శతాబ్దాల చరిత్ర కలిగిన గుడిమెట్ల గురించి తెలుసుకుందాం..!

(చందర్లపాడు, ఆంధ్రజ్యోతి) చుట్టూ కొండలు, వాటి మధ్య ఒంపులు తిరుగుతూ ప్రవహించే కృష్ణానది అందాలతో కనువిందు చేసే గుడిమెట్ల గ్రామానికి శతాబ్దాల చరిత్ర ఉంది. పదకొండో శతాబ్దంలో గుడిమెట్ల కొండలపై ఏడుకోటలు ఉండేవి. ఆ కోటల్లో రాజులు ఉండేవారు. ఏడుపేటల్లో ప్రజలు నివసించేవారు. అప్పట్లో రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు ఆ కొండలపై శివ, కేశవులకు ఆలయాలను నిర్మించారు. భారీగా బంగారు ఆభరణాలను, బంగారు విగ్రహాలను ఆలయాల్లో ఏర్పాటు చేశారు. కాలక్రమేణా కలరా, మశూచి, ప్లేగు, అంటువ్యాధులు తరచూ సోకుతుండడంతో చాలామంది ప్రజలు మరణించారు. అంటువ్యాధులకు అడ్డుకట్ట వేసే క్రమంలో కొండలపై నుంచి ప్రజలను దూరంగా తీసుకొచ్చి కొత్తగా ఒక గ్రామాన్ని నిర్మించారు. ఆ గ్రామమే నేడు రామన్నపేట(గుడిమెట్ల)గా పిలవబడుతోంది. రాజులు, రాజ్యాలు పోవడంతో పాటు కాలక్రమేణా కోటలు, పేటలూ కనుమరుగయ్యాయి. రాజులు నిర్మించిన ఆలయాలు కావడంతో గుప్తనిధులు ఉంటాయన్న ఆలోచనతో దొంగలు ఆ ఆలయాలను కొల్లగొట్టారు. భారీగా బంగారం, విగ్రహాలను ఎత్తుకెళ్లిపోయారు. ఊరికి దూరంగా ఉండడంతో పూజారులు కూడా నిత్య నైవేద్యాలు పెట్టకుండా వదిలేశారు. శతాబ్దాలపాటు ఆలయాలను ఆలనాపాలనా ఎవరూ పట్టించుకోలేదు.

అఖండ-2తో అభివృద్ధికి అడుగులు


అఖండ-2 సినిమా చిత్రీకరణ ద్వారా గుడిమెట్ల గ్రామం మరోమారు ప్రచారంలోకి వచ్చింది. సహజవనరులకు నెలవైన ఈ ప్రాంతం తిరిగి గత వైభవాన్ని చాటుకొనేందుకు ఈ చిత్రం బాటలు వేస్తుందని ప్రజలు భావిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం అమరావతి నుంచి ముక్త్యాల వరకూ ట్రెంచ్ ఏర్పాటు చేసి బోట్‌షికార్, జలరవాణా ఏర్పాటు చేయాలని భావించింది. ఆమేర కొంత పనులు కూడా జరిగాయి. ఈదశలో వైసీపీ అధికారంలో రావడంతో పనులు నిలిచిపోయాయి. తిరిగి కూటమి ప్రభుత్వం వచ్చింది. టూరిజంపై ప్రత్యేక శ్రద్ధ ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు బోట్‌షికార్‌కు ట్రెంచ్ ఏర్పాటు చేయడంతో పాటు అలకనంద ప్రాజెక్ట్ పనులు కూడా పూర్తయితే ఈప్రాంతం పూర్తిస్థాయి అభివృద్ధి జరగనుంది. అఖండ-2 చిత్రంతో పాటు పలు చిత్ర నిర్మాణాలకు ఈ ప్రాంతం కేంద్రం కానుందని ప్రజలు సంబరపడుతున్నారు. తమ అభిమాన నటుడు నందమూరి బాలకృష్ణ రాక కోసం వేచి చూస్తున్నారు.

పుష్కరాల పుణ్యమా..

2004లో కృష్ణా పుష్కరాల సందర్భంగా శివకేశవుల ఆలయాలకు జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. అప్పటి నుంచి ఆ ఆలయాలు భక్తులతో కళకళలాడున్నాయి. ఆ సమయంలోనే ఆలయాలకు దిగువన ఒక రైతు పొలంలో శ్రీమహాలక్ష్మి అపురూప విగ్రహం బయటపడింది. చారిత్రక నేపథ్యం కలిగిన ఆ విగ్రహం విలువ వంద కోట్ల వరకూ ఉంటుందని అంచనాలు ఉన్నాయి. ఆ విగ్రహాన్ని గ్రామస్థులు ప్రభుత్వానికి అందజేశారు. ఆ ప్రాంతంలో రాజులు అనేక గుప్తనిధులు దాచి ఉంటారని ప్రజలు గట్టిగా విశ్వసిస్తున్నారు. రాచరికపు పాలనలో వజ్ర, వైఢూర్యాలకు కొదవలేదని కొన్ని ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. తొలకరి వర్షాలు పడిన ప్రతిమారు ఆ ప్రాంతంలో వజ్రాలు విచ్చలవిడిగా దొరుకుతున్నాయి. పరిసర గ్రామాల ప్రజలతో పాటు గుంటూరు జిల్లాకు చెందిన ప్రజలు కూడా ఇక్కడ వజ్రాలు వెతుకుతుంటారు.

అందాల కొండలు..కృష్ణమ్మ పరవళ్లు

ఈ ప్రాంత చారిత్రక ప్రాధాన్యం తెలిసే దర్శకుడు బోయపాటి అఖండ-2 చిత్రం చిత్రీకరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అందమైన గుడిమెట్ల కొండలపై నుంచి కృష్ణానది వైపు చూస్తే కొండల మధ్య ఒంపుసొంపులతో పరవళ్లు తొక్కే కృష్ణమ్మ కనువిందు చేస్తుంది. గుడిమెట్ల నుంచి ఇరవై కిలోమీటర్ల మేర నది అత్యంత లోతుగా ఉంటుంది. చరిత్రలో ఎన్నడూ ఈ ప్రాంతంలో ఏరు ఎండిన దాఖలాలు లేవు. ప్రకాశం బ్యారేజ్‌లో బ్యాక్‌వాటర్ తగ్గినా ఈ ప్రాంతంలో నీరు ఉంటుంది. అందుకే షూటింగ్‌కు ఈ ప్రాంతాన్ని ఎన్నుకున్నట్టు తెలుస్తోంది.



అందమైన ప్రకృతి రమణీయ దృశ్యాలతో కనువిందు చేస్తున్న కృష్ణానది

ముడా ఆదాయం పెరిగేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో ముడా చైర్మన్ మట్టాప్రసాద్, జేసీ గీతాంజలిశర్మ

మచిలీపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం అర్బన్‌డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) ఆదాయమార్గాలను పెంచేందుకు ప్రణాళికలు రూపొందించాలని కృష్ణా కలెక్టర్ బాలాజీ అధికారులకు సూచించారు. ముడాచైర్మన్ మట్టాప్రసాద్ అధ్యక్షతన ముడా సమావేశం కలెక్టరేట్‌లోని మినీ సమావేశపుహాలులో శుక్రవారం జరిగింది. సమావేశంలో కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముడా చైర్మన్ మాట్లాడుతూ, ముడా పరిధిలోని అన్నిగ్రామాల్లో, నగరాల్లో నిర్మాణం జరిగే అన్ని భవనాలకు ఆన్‌లైన్‌లో ఇకనుంచి నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ అనుమతులు పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ముడా ఆదాయాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రణాళికలు రూపొందించాలని, ముడా పరిధిలో మచిలీపట్నం పోర్టుకు అనుబంధంగా పారిశ్రామికవాడల అభివృద్ధికోసం అధికారులు పరిశీలనచేసి, నివేదికను ఇవ్వాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ముడా కార్యాలయానికి భవనం నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని కేటాయించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళికశాఖ జాయింట్ సెక్రటరీ జె.శివయ్య, రాజమండ్రి రీజనల్ టౌన్‌ప్లానింగ్ డెప్యూటీ డైరెక్టర్ బి.శ్రీనివాసమూర్తి, పరిశ్రమలశాఖ జీఎం ఆర్.వెంకట్రావ్, ముడా డిప్యూటీ కలెక్టర్ రవిశంకర్ వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు



లాటరీ తీసి సబ్‌కాస్టలను కేటాయిస్తున్న జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కల్లు గీత కులస్థులకు లాటరీ పద్ధతిపై శుక్రవారం వివిధ మండలాల్లోని కార్మికులకు జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ 12 మద్యం షాపులను కేటాయించారు. 123 దుకాణాల్లో కృష్ణాజిల్లాకు 12 కేటాయించారు. ఈ 12 షాపులను లాటరీ పద్ధతిపై వివిధ మండలాల్లో ఉన్న గీత కులస్థులకు కేటాయించారు. గౌడ కులస్తులకు గుడివాడ రూరల్‌మండలం, పమిడిముక్కల, తాడిగడప మునిసిపాలిటీలను కేటాయించారు. శెట్టిబలిజలకు మచిలీపట్నం రూరల్ మండలం లాటరీలో వచ్చింది. గౌడ కులస్థులకు మచిలీపట్నం నగరపాలక సంస్థ, పెడన మునిసిపాలిటీ, గూడూరు, గుడివాడ, పెడన రూరల్, కోడూరు, పెదపారుపూడి, బాపులపాడు మండలాలను కేటాయించారు. ఈ సందర్భంగా జేసీ గీతాంజలి శర్మ మాట్లాడుతూ, జనవరి 27న నోటిఫికేషన్ ఇస్తామని, దరఖాస్తు చేసుకున్న గీతకార్మికులకు మళ్లీ ఫిబ్రవరి 7న లాటరీ తీసి షాపులు కేటాయిస్తామన్నారు. ఆయా మండలాల్లోని గీత కార్మికులు దరఖాస్తుతోపాటు రూ2 లక్షలు రుసుము చెల్లించాలన్నారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస చౌదరి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గంగాధరరావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ భార్గవ, స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రకాష్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ గారూ.. భూ సమస్య పరిష్కరించండి..

- బొడ్డపాడు రైతు శ్రీధర్‌బాబు ఆవేదన



తోట్లవల్లూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 'మంత్రి నారా లోకేశ్ గారు జూలైలో మిమ్మల్ని కలిసి నా భూ సమస్యను స్వయంగా తెలియజేశాను. పట్టాదారు పాసుపుస్తకం, అడంగల్ కాపీ రెండూ మీకు చూపాను. రెండెకరాలు వ్యవసాయ భూమి పట్టాదారు పాసుపుస్తకంలో ఉంటే ఆన్‌లైన్ అడంగల్లో 32 సెంట్ల భూమిని తగ్గించేసి 1.62 ఎకరాలు ఉన్నట్టు నమోదు చేశారు. రెవెన్యూ అధికారులు ఆరు నెలలైనా న్యాయం చేయకుండా తిప్పుతున్నారు. నా భూమి సమస్యను పరిష్కరించండి'.. అని బొడ్డపాడుకు చెందిన రైతు సూర్యదేవర శ్రీధర్‌బాబు శుక్రవారం మీడియా ద్వారా తన ఆవేదనను వెల్లడించారు. తన భార్య వాసవి, కుమార్తె పూజితసాయికి పెదపారుపూడి మండలం యలమర్రులో తన అత్తవారు సర్వేనెం 175-2లో 1.76 ఎకరాలు, సర్వేనెం 175-3లో 24 సెంట్లు మొత్తం 2 ఎకరాల మాగాణి వ్యవసాయ భూమిని ఇచ్చారని, ఈ రెండెకరాలకు 06ఆర్40నెం 18000212 నెంబరుతో పట్టాదారు పాసుపుస్తకాన్ని పెదపారుపూడి రెవెన్యూ అధికారులు ఇచ్చారని శ్రీధర్ తెలిపారు. కుమార్తె ఇంజనీరింగ్ చదువు నిమిత్తం బ్యాంకు లోను తీసుకునేందుకు గ్రామ సచివాలయం నుంచి ఆన్‌లైన్ అడంగల్ కాపీ తీసుకుంటే అందులో 1.62 ఎకరాల భూమి మాత్రమే ఉన్నట్టు పేర్కొన్నారని, దీంతో జూలైలో మంత్రి లోకేశ్‌ను కలిసి సమస్యను వివరించానని తెలిపారు. అప్పటి నుంచి ఇంత వరకు అడంగల్లో 2 ఎకరాల భూమిని చేర్చకుండా తిప్పుతున్నారని, బిడ్డల చదువుకు డబ్బులు లేక ఆటంకం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మంత్రి స్పందించి తన భూ సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

సీఎం చంద్రబాబుకు ఘనస్వాగతం

గన్నవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : దావోస్ పర్యటనను ముగించుకుని గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న సీఎం చంద్రబాబునాయుడుకు ఘనస్వాగతం లభించింది. శుక్రవారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఇక్కడికి ఆయన విచ్చేశారు. మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్‌యాదవ్, కందుల దుర్గేష్, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు తదితరులు పూలబొకేలు అందజేసి స్వాగతం పలికారు.

చెత్త పన్ను వసూలు చేసి జగన్ చెత్తను వదిలేశారు

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

గుడివాడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : గత వైసిపి ప్రభుత్వం ప్రజల నుండి చెత్త పన్నును ముక్కు పిండి వసూలు చేసిందని, కానీ రాష్ట్రంలో 86లక్షల చెత్తను వదిలేసి వెళ్లిందని స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి ఆరోపించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు అక్టోబరు 2 స్వచ్ఛ దివస్ నాటికి రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు శ్రీకారం చుట్టామన్నారు. చెత్త నుండి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్‌లకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇంటింటికి చెత్త సేకరణకు క్లాప్ వాహనాలను తిరిగి అందుబాటులోకి తీసుకువస్తామని, త్వరలో ఎలక్ట్రిక్ వాహనాలను కూడా చెత్త సేకరణకు ప్రవేశపెడుతున్నామన్నారు. గత వైసిపి ప్రభుత్వం గుడివాడను పూర్తిగా విస్మరించిందని, పూర్వ ఖ్యాతిని తెచ్చేందుకు కష్టపడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్లకు అన్ని విధాలుగా సహకరిస్తానన్నారు. గుడివాడలో 2లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందని, దానిలో ఇప్పటికే 50వేల టన్నుల చెత్తను తొలగించామన్నారు. గుడివాడలో రోజుకు 61టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుందని, పురపాలక సంఘానికి కావలసిన పనిముట్లు, యంత్ర పరికరాలను స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ నుండి అందజేస్తామన్నారు. అమృత్ ఫేజ్-2.0లో భాగంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి డిపిఆర్‌లు సిద్ధం చేసామని, గుడివాడలో మినీ ప్రాసెసింగ్ యూనిట్‌లను ఏర్పాటు చేసి తడి, పొడి చెత్తలను వేరు చేసి సంపద సృష్టిస్తామన్నారు. గుడివాడలో అవసరమైన చోట్ల మహిళల కోసం పింక్ మోడ్రన్ టాయిలెట్‌లను కార్పోరేషన్ తరుపున ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మడమ తిప్పరు..!

(5వ పేజీ తరువాయి)

చెందిన ఓ వ్యక్తి కన్నేశాడని స్థానికులు చెబుతున్నారు. భీమవరానికి చెందిన కొందరు వ్యక్తులతో కలిసి ఈ భూములను గుట్టుచప్పుడు కాకుండా ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని తెలుస్తోంది. తొలివిడతగా మడచెట్లను నరికేసి, కొంతకాలంపాటు భూమిని తమ ఆధీనంలో ఉంచుకుని, ఆ తరువాత రెవెన్యూ అధికారులను, స్థానిక రాజకీయ నాయకులను మచ్చిక చేసుకుని వేసవిలో రొయ్యల చెరువులుగా మార్చేందుకు ఎత్తుగడ వేశాడని సమాచారం.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఈ ఆక్రమణ వ్యవహారంపై పూర్తిస్థాయి వివరాలు సేకరిస్తాం. అటవీ శాఖ అధికారులతో కూడా మాట్లాడి మడ చెట్లను నరుకుతున్న, ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకుంటాం.

- నాగభూషణం, మచిలీపట్నం నార్త్‌మండల తహసీల్దార్

అదృశ్యం వెనుక..

(5వ పేజీ తరువాయి)

ముక్కుముఖం తెలియకపోయినా ఫాలో అవుతున్నారు. ఆ తర్వాత చాటింగ్‌లు చేసుకుంటున్నారు.

ఎక్కడి నుంచో నియంత్రణ

తాజాగా అజిత్‌సింగ్‌నగర్‌లో ముగ్గురు అమ్మాయిలు అదృశ్యమయ్యారు. తొలుత వీరిలో ఒకరికి బెంగళూరులో ఉన్న అబ్బాయితో ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైంది. ఈ ఇద్దరూ చాటింగ్ చేసుకుంటున్న సమయంలో తన స్నేహితురాళ్ల వీడియోలను అతడికి చూపించింది. దీనికి ప్రతిస్పందనగా అతడు తన మరో ఇద్దరు స్నేహితులను ఆమెకు చూపించాడు. ఈ బాలిక ద్వారా ఆమె స్నేహితులకు బెంగళూరులో ఉన్న యువకుడి స్నేహితులు ఇన్‌స్టాలో పరిచయమయ్యారు. ఈ ముగ్గురు యువకులు చెప్పినట్టుగా ఆ అమ్మాయిలు ఇంట్లో వారికి తెలియకుండా నగరం దాటేశారు. తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదుతో పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి, సెల్‌ఫోన్‌ను ట్రాక్ చేసి ముగ్గురు అమ్మాయిలను వెనక్కి తీసుకొచ్చారు. ఉత్తర మండలంలో ఉన్న ప్రజల్లో ఎక్కువ మంది ఉపాధి, సంపాదనలో తలమునకలై ఉంటారు. పిల్లలపై పర్యవేక్షణ చాలావరకు తక్కువగా ఉంటుంది. దీన్ని అమ్మాయిలు, అబ్బాయిలు అవకాశంగా మార్చుకుంటున్నారు. అబ్బాయిలు చెడు వ్యసనాలవైపు అడుగులు వేస్తున్నారు. అమ్మాయిలు మాయదారి పరిచయాలతో పొరుగు ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు.

పిల్లలకు ఫోన్లను తగ్గించాలి

పిల్లలకు ఫోన్లు ఇచ్చి వదిలేయడం సరికాదు. అమ్మాయిలు ఫోన్లు ఉపయోగిస్తుంటే వారి ఫోన్లను తల్లిదండ్రులు తరచూ పరిశీలిస్తుండాలి. నిరంతరం ఇన్‌స్టా, ఫేస్‌బుక్, స్నాప్‌చాట్ వంటి యాప్‌లతో కాలక్షేపం చేస్తున్నప్పుడు కచ్చితంగా పరిశీలించాలి.

- గుణరాం, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్

జంప్ డిపాజిట్.. ఖాతాలు ఖాళీ

(5వ పేజీ తరువాయి)

అయినా.. చెల్లింపులన్నీ డిజిటల్‌గానే జరుగుతున్నాయి. ఈ విషయానే సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. తమ వద్ద ఉన్న జాబితాలోని ఫోన్ నెంబర్లకు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా ఎంతో కొంత మొత్తాన్ని ముందుగా పంపుతున్నారు. తర్వాత ఆ వ్యక్తులకు ఫోన్‌చేసి మరొకరికి పంపాల్సిన డబ్బు పొరపాటున తమకు వచ్చాయని మాయమాటలు చెబుతున్నారు. ఆ డబ్బు తిరిగి పంపేస్తామని ఇవతలి వ్యక్తులు చెప్పగానే, తాము ఒక లింకు పంపుతామని, దానికి సెండ్ చేయాలంటున్నారు. గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా ఈ లింకును వారికి పంపుతున్నారు. ఈ లింకు ద్వారా చెల్లింపులు చేసే సమయంలో మొత్తం వివరాలను సైబర్ నేరగాళ్లు లాగేసుకుంటున్నారు.

లింకు తెరిస్తే ఇరుక్కున్నట్టే..

ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా చెల్లింపులు చేసేటప్పుడు ఏ బ్యాంకు ఖాతా నుంచి డబ్బు పంపుతున్నామో దాని పిన్ నమోదు చేయాలి. కొన్ని బ్యాంక్ ఖాతాలకు నాలుగు అంకెల పిన్, మరికొన్నింటికి ఆరు అంకెల పిన్ ఉంటాయి. సైబర్ నేరగాళ్లు పంపిన లింకును తెరిచి డబ్బు పంపే సమయంలో ఇవతలి వ్యక్తి పిన్ నమోదు చేయగానే.. ఆ మొత్తం సమాచారం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి చేరుతుంది. పిన్‌తోపాటు బ్యాంకు ఖాతాలో ఎంత నిల్వ ఉందో వారికి తెలిసిపోతుంది. డబ్బు పంపిన కాసేపటికే.. సైబర్ నేరగాళ్లు సదరు ఖాతాను మొత్తం ఊడ్చేస్తున్నారు. ఈ నేరాలు ఇప్పుడు పోలీసులకు కొత్త సవాలుగా మారాయి. ఇప్పటివరకు పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ తరహా కేసు నమోదు కాలేదు. అయినప్పటికీ ఇలాంటి నేరాలకు అడ్డుకట్ట వేయడానికి ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 499

గురుకుల పాఠశాల తనిఖీ

ఉయ్యూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలను తహసీల్దార్ ఎం సురేశ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపట్టీ పరిశీలించి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే పుస్తకాలు, ఇతర వస్తువుల లభ్యతను పరిశీలించారు. అనంతరం ఆహార పదార్థాల నాణ్యత, స్టాక్ రిజిస్టర్ ప్రకారం సరుకులు, వంటగది పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాన కల్పించాలని సిబ్బందికి సూచించారు.



వంటకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేశ్‌కుమార్



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

పెనమలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు మండలం గొడవర్రు గ్రామానికి చెందిన నీలం రజిత ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన అరవై వేల విలువైన చెక్కును శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అందజేశారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రజిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, తుమ్మలపల్లి హరికృష్ణ, పీతా గోపీచంద్, యేనుగు శ్రీనివాస్, యాళ్ల చక్రవర్తి, సుంకర రమేష్, బొంగరాల అబ్రహం, పండల రజిని తదితరులు పాల్గొన్నారు.



కేసును వివరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ మురళి, ఎస్సై సందీప్

కార్ టైర్ల దొంగల అరెస్టు

కంకిపాడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కార్ టైర్ల దొంగలను అరెస్టు చేసినట్టు గన్నవరం డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మీడియాకు వివరాలను వెల్లడించారు. డిసెంబరు 30న మండలంలోని ఈడుపుగల్లులోని ట్రూ వ్యాల్యూ కార్ షోరూమ్‌లోని 11 కార్లకు సంబంధించిన 44 టైర్లు, వాటి డిస్కులను దొంగలు అపహరించుకు పోయారని కంకిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిఘా పెట్టారని, శుక్రవారం ఉదయం టైర్లను వ్యాన్‌లో తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు సోదాలు నిర్వహించారని, ఈ సోదాల్లో కంకిపాడు మండలంలోని చలివేంద్రపాలెంకు చెందిన వల్లూరి బాలాజి, పామర్రుకు చెందిన చింతపల్లి నరేంద్రలను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించి, సుమారు రూ. 3.52 లక్షల విలువైన టైర్లు, వాటి డిస్కులను స్వాధీన పరుచుకున్నామని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని ఆయన సత్కరించారు. ఈ సమావేశంలో సీఐ మురళీకృష్ణ, ఎస్సై సందీప్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న కేవీఆర్ కిషోర్

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

గన్నవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రీడల్లో రాణిస్తేనే మంచి భవిష్యత్తు ఉంటుందని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, కేవీఆర్ ఇండోర్ స్టేడియం వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కేవీఆర్ కిషోర్ అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో ఉత్సాహంగా సబ్‌జోన్ క్రీడలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ, క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం చేకూరుతుందన్నారు. హెచ్‌ఎం గొట్టం వెంకట రవిబాబు సీనియర్ ఖోఖో కోర్టును ప్రారంభించారు. 8 క్రీడలకు సంబంధించి గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల నుంచి 350 మంది బాలురు పోటీల్లో పాల్గొన్నట్లు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. పి. వెంకటేశ్వరరావు, రామచంద్రుడు, ఎస్ వెంకటేశ్వరరావు, సుబ్బారావు, మీరా సాహేబ్, శాంతికిరణ్, బాలకృష్ణ, నారాయణ, రామారావు, నాగరాజు, శ్రీదేవి, సుజాత, విజయకుమారి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో రుద్రాభిషేకం 27న

హనుమాన్‌జంక్షన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాపులపాడు శ్రీశైల మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఈ నెల 27న త్రయోదశి సందర్భంగా స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషకం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు గూడవల్లి చిన్నా తెలిపారు. రుద్రాభిషేకాలు,నందీశ్వర స్వామికి అభిషేకం, హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఉంగుటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా వుండాలని, ఆల్కహాల్, గంజాయి, పొగాకు, డ్రగ్స్ వంటి వాటికి అలవాటుపడితే భవిష్యత్తు సర్వనాశనం అవుతుందని నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎస్.జాకబ్‌రాజు సూచించారు. నవజీవన్ బాలభవన్ (విజయవాడ) ఆధ్వర్యంలో శుక్రవారం తేలప్రోలు జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంవల్ల కలిగే నష్టాలపై స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. నవజీవన్ బాలభవన్ సంస్థ ఆధ్వర్యంలో నూజివీడు మండలం పొలసానిపల్లిలో ఏర్పాటుచేసిన బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్లో ఉచితంగా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9490492020 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

కొయ్యూరు వద్ద ఆర్వోబీ నిర్మించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : కొయ్యూరు వద్ద విస్తరణతో కూడిన అభివృద్ధి జరిగిన రహదారిపై రైల్వేగేటు వద్ద ఆర్వోబీ నిర్మించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కొయ్యూరు, పల్లెర్లమూడి, బొమ్ములూరు తదితర గ్రామాలకు వెళ్లే రహదారి పై రైల్వే గేటు వేసి ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులెదురవుతున్నాయని, స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులతో పాటు వివిధ ఫ్యాక్టరీలకు వెళ్లే కార్మికులు కూడా సమయానికి చేరుకోలేక ఇబ్బందులెదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను ఫ్యాక్టరీలకు తరలించాలన్నా ఇదే రహదారిపై ప్రయాణించాలని తెలిపారు. ఆర్వోబీ నిర్మాణం వల్ల పశువులు రైల్వే లైన్ దాటుతుండగా జరిగే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆర్వోబీ నిర్మాణానికి అంచనాలు రూపొందించడంతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారని కొయ్యూరు గ్రామస్తుడు కాండ్రు అజయ్‌కుమార్ వివరించారు. ఆర్వోబీ అప్రోచ్ రోడ్డుకు అవసరమైన స్థలం కూడా అందుబాటులో ఉందని సర్పంచ్ కొల్లి వెంకట సత్యన్నారాయణ తెలిపారు. సమస్యను పరిగణలోకి తీసుకుని కొయ్యూరు రైల్వే గేటుపై ఆర్వోబీ నిర్మించాలని కోరుతున్నారు.



కొయ్యూరు వద్ద రైల్వే గేటు వేయడంతో ఆగిపోయిన వాహనాలు







బాపులపాడు హైస్కూల్‌లో విద్యార్థినుల ప్రతిజ్ఞ.. కొత్తపల్లి ఎంపీయూపీ స్కూల్‌లో.. పెదఅవుటపల్లిలో ర్యాలీ..

బాలిక సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

వాడవాడలా జాతీయ బాలికా దినోత్సవం

ఉయ్యూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాలు, ఆడపిల్లల అక్రమ రవాణా అరికట్టి లింగ వివక్ష రూపుమాపేందుకు అందరూ ముందుకు రావాలని ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం కడవకొల్లు ప్రాథమికోన్నత పాఠశాలలో బాలికలతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలను రక్షిందాం, ఆడపిల్లలను చదివిద్దాం, బాల్య వివాహాలు అరికడదాం అనే నినాదాలతో బాలికలు ప్లకార్డులు చేతపట్టుకుని ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ం శ్రీధర్, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కడవకొల్లులో జాతీయ బాలిక దినోత్సవ ర్యాలీ

హనుమాన్‌జంక్షన్ : సామాజిక సమతుల్యాన్ని కాపాడటానికి బాలికా సంరక్షణ ఎంతో అవసరమని బాపులపాడు హెచ్‌ఎం నాగేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో అంగన్వాడీ కార్యకర్తలు వేడుక నిర్వ హించారు. వేడుకను హెచ్.ఎం.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిర్వహించారు. కార్యక్రమంలో బాపులపాడు పీహెచ్‌సీ సీహెచ్‌వో ఫణికుమార్, సూపర్ వైజరు అప్పారావు, అంగన్వాడీ సూపర్ వైజరు శిరీష సిబ్బంది, పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : కొత్తపల్లి ఎంపీయుపీ స్కూల్‌లో, రేమల్లె, వీరవల్లి హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవ సందర్భంగా కిషోరి వికాసంపై అవగాహన కల్పించారు. వీరవల్లిలో ఏఎన్‌ఎం నాగమణి, అంగన్వాడీ వర్కర్లు రమాదేవి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు. రేమల్లెలో ఉపాధ్యాయులు వెంకటకుమారి, వెలమర్తి రవిబాబు, అంగన్వాడీ వర్కర్లు లక్ష్మి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు. కొత్తపల్లిలో సూపర్‌వైజర్ ధనలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఉంగుటూరు : లింగ వివక్షతను రూపుమాపి సమానత్వం సాధించేందుకు చేసే కృషిలో అందరూ భాగస్వాములు కావాలని గన్నవరం సీడీపీవో పి.వెంకటలక్ష్మి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలోని పొట్టిపాడు జడ్పీహైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో బాలికల హక్కులు, చట్టం, రక్షణ, అసమానత్వం, బాల్యవివాహాలు తదితర అంశాలపై కిశోరి బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ బి.పద్మాదేవి, వెల్ఫేర్‌అసిస్టెంట్, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

● పెదఅవుటపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీహైస్కూల్ బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీహెచ్‌వో జీవ కాంత్‌రాజు, హెచ్‌ఎస్‌లు చంద్రశేఖర్, రోజిలీన్, పీహెచ్‌ఎన్ నరసింహారావు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



కంప్యూటర్‌ను అందజేస్తున్న టీడీపీ నేత గొట్టిపాటి శివరామకృష్ణ

దాతల సహకారం అభినందనీయం

కంకిపాడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందు కొచ్చి సహకరించటం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి శివరామకృష్ణ అన్నారు. ఉప్పలూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు దాతల సహకారంతో అందచేసిన కంప్యూటర్‌ను శుక్రవారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కె.ఎస్.ఎన్ ప్రసాద్, చలసాని రాధాకృష్ణమూర్తి, కనగాల సుబ్బారావు, కొణతం సుబ్రహ్మణ్యం, కొండవీటి శివయ్య, పడవల మధుసూదన రావు, కలపాల రాజేష్, కొల్లి కిషోర్, శనగశెట్టి ప్రసాద్, లాం జోస్ పాల్గొన్నారు.

ఉషారామాలో జాతీయస్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్-2025 ప్రారంభం

ఉంగుటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతోపాటు ఉద్యోగంలో రాణించడానికి అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని విశ్రాంత డీజీపీ (ఐపీఎస్) మండవ విష్ణువర్ధనరావు సూచించారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో రెండురోజులపాటు జరిగే జాతీయస్థాయి టెక్నోకల్చరల్ ఫెస్ట్-2025 శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. యువర్ ఫెస్ట్‌ను ప్రారంభించిన కళాశాల ఛైర్మన్ సుంకర రామబ్రహ్మం మాట్లాడుతూ, విద్యార్థులు తమ టెక్నికల్ స్కిల్స్‌ను పెంపొందించుకోవడానికి ఇలాంటి ఫెస్ట్‌లు ఎంతగానో దోహదపడతాయన్నారు. విశిష్టఅతిథిగా హాజరైన ఇండియన్ టెలీకామ్ సర్వీసెస్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ వై.రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు రాణించాలని సూచించారు.



ప్రసంగిస్తున్న విశ్రాంత డీజీపీ విష్ణువర్ధనరావు

ప్రసాదంపాడులో పరిటాల వర్ధంతి

ప్రసాదంపాడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్వర్గీయ పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భంగా ప్రసాదంపాడు ఎన్టీఆర్ సర్కిల్‌లో ఆధ్వర్యంలో 16వ వార్డు మెంబర్ శివ దుర్గ పూలమాలలు వేసి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఫ్రూట్స్, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు జ్యోతి, నక్కలపూడి కృష్ణ ప్రసాద్, కొమ్మ నాగభూషణం, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి ఫర్నీచర్ వితరణ

ఉయ్యూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జబర్లపూడి గ్రామపంచాయతీ కార్యాలయానికి అవసరమైన ఫర్నీచర్‌ను గ్రామానికి చెందిన బీఎస్‌ఆర్‌కే ప్రసాద్, యలమంచిలి సుబ్బారావు, మొవ్వ శ్రీనివాసకుమార్ శుక్రవారం వితరణగా అందజేశారు. బీఎస్‌ఆర్‌కు ప్రసాద్ ఆఫీస్ టేబుల్, సుబ్బారావు 6 కుర్చీలు, మొవ్వ శ్రీనివాసకుమార్ 2 సీలింగ్ ఫ్యాన్లు అందచేశారు. దాతలకు సర్పంచ్ శేషవరప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.



సీబీఎస్‌ఈ ప్రాంతీయ అధికారికి జ్ఞాపికను అందిస్తున్న పాఠశాల యాజమాన్యం

లలిత కళలను ప్రోత్సహించాలి

పెనమలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సృజనాత్మకతమైన, వినూత్నమైన ఆలోచనా విధానం కలిగి ఉన్నట్లయితే అద్భుతాలు సృష్టించవచ్చని, లలిత కళల ద్వారా కూడా ఉద్యోగాలను సంపాదించి ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని సీబీఎస్‌ఈ ప్రాంతీయ అధికారి సువేందు శేఖర్‌దాస్ పేర్కొన్నారు. శుక్రవారం కానూరు కేసీపీ సిద్ధార్థ పాఠశాల విద్యార్థులు మొగల్రాజపురం సిద్ధార్థ కళాపీఠంలో జరుపుకొన్న సృజన - 2025 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల కన్వీనరు వీరపనేని శశికళ మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యతో పాటు సర్వతోముఖాభివృద్ధికి చిత్రలేఖనం, క్రాఫ్ట్, ఎంబ్రాయిడరీ మొదలైన సహ పాఠ్యాంశాలను ప్రతిరోజూ విధిగా నేర్పించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోజ్ కర్మాకర్, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శులు నిమ్మగడ్డ లలిత్‌ప్రసాద్, సూరెడ్డి విష్ణు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాలతో పశుపోషకులకు మేలు

ఉంగుటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణప్రాంతాల్లో పశుపోషణ చేపట్టే రైతులకు అండగా నిలిచి వారికి మేలు చేకూర్చేందుకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశు ఆరోగ్యశిబిరాలను పశుపోషకులందరూ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ పెదఅవుటపల్లి గ్రామకమిటీ అధ్యక్షుడు మున్నా రామకృష్ణ అన్నారు. ఇందుపల్లి, ఉంగుటూరు, ఆత్కూరు వెటర్నరీ డిస్పెన్సరీ(వీడీ)ల పశువైద్యాధికారులు డాక్టర్ జి.సుధీర్‌బాబు, డాక్టర్ జి.స్వర్ణలత, డాక్టర్ ఎన్.నాగార్జున నేతృత్వంలో మండలంలోని వేమండ, నాగవరప్పాడు, పెదఅవుటపల్లి గ్రామాల్లో శుక్రవారం పశుఆరోగ్యశిబిరాలను నిర్వహించారు.

ఉయ్యూరు : కాటూరులో శుక్రవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎన్ నరసింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా 300 గొర్రెలకు నట్టల నివారణ మందు, 35 లేగదూడలకు ఏలికపాముల మందు వేశారు. 50 గేదెలు, ఆవులకు వివి ధ రకముల వైద్యపరీక్షలు చేసి మందులు అందచేశారు. సర్పంచ్ ఆశాజ్యోతి, పశు వైద్యశాల అధికారి డి వీణ, ప్రత్యేక అధికారి పి పద్మ, ఎం ఉమ, సృజనీ పాల్గొన్నారు.



కాటూరులో ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశుసంవర్ధక అధికారి నరసింహులు



నాగవరప్పాడులో పశుపోషకులకు మందులు అందజేస్తున్న ఉంగుటూరు వెటర్నరీ వైద్యాధికారి స్వర్ణలత

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పశుపోషణ ద్వారా రైతుకు చేయూత నందించే విధంగా వ్యాధులను ముందుగానే గుర్తించి బాసటగా నిలచేందుకే పశు వైద్య శిబిరాల నిర్వహణ అని సర్పంచ్ యజ్ఞవరపు వెంకట రంగారావు, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ శ్రవణ్‌కుమార్ వేర్వేరు కార్యక్రమాల్లో సూచించారు. దంటగుంట్లలో డాక్టర్ రేవతి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పశుఆరోగ్య శిబిరంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పోషకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెవీఏ రాంబాబు, ఎహెచ్ఎ కిషోర్, సహదేవుడు, గోపాలమిత్ర రవి, రైతులు పాల్గొన్నారు. ఓగిరాలలో పశువులకు గర్భధారణ చికిత్సలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు, మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీదివ్య, ఎహెచ్ఎ జిలాని, దివ్య, పాల సొసైటీ అధ్యక్షుడు సజ్జా వెంకట సుబ్బారావు, ప్రసన్నరాణి, తదితరులు, పాడి రైతులు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.490

సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి వెండి ఆభరణాలు బహూకరణ

మోపిదేవి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి హైదరాబాద్‌కు చెందిన రెడ్రోతు మురళీకృష్ణ ఒక కేజీ 2 గ్రాముల బరువు గల వెండి ఆభరణాలను బహూకరణగా ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు అందించారు. శుక్రవారం కుటుంబసమేతంగా ఆలయానికి విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఒక లక్షా 8 వేల విలువ గల వెండి గ్లాసు, రెండు ప్లేట్లు, రెండు పాదుకలు స్వామికి కానుకగా అందజేశారు.





మాట్లాడుతున్న డ్వామా పీడీ సాయిబాబు

సూర్య ఘర్‌పై అవగాహన పెంచాలి

అవనిగడ్డ రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సూర్య ఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని మెప్మా ఏపీడీ పి.సాయిబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సూర్య ఘర్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ వ్యక్తిగత నివాసం, సామూహిక గృహ కామన్ సర్వీసులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. మీటర్ అమర్చిన తర్వాత వినియోగదారులు పోర్టల్‌లో బ్యాంక్ వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ పథకం కింద యూనిట్ రూ.2.17 పైసలకు లభ్యమవుతుందని, దీనిలో 90 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బంది ప్రతిఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు.

మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆక్రమణల తొలగింపు



పెడన: జిల్లా లీగల్ సెల్ అథారిటీ న్యాయమూర్తి ఆదేశాల మేరకు పట్టణంలోని మహాత్మా గాంధీ మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్సులో ఆక్రమణలను మునిసిపల్ అధికారులు శుక్రవారం తొలగించారు. కాంప్లెక్స్‌లోని షాపులకు ఎదురుగా ఉన్న స్థలాన్ని కొందరు చిరు వ్యాపారులు ఆక్రమించి చిన్న చిన్న కొట్లు పెట్టుకుని వ్యాపారాలు చేస్తున్నారు. ఈ ఆక్రమణలు షాపింగ్ కాంప్లెక్సులోని షాపుల యజమానులకు ఇబ్బందికరంగా మారింది. సమస్యను జిల్లా లీగల్ సెల్ అథారిటీ న్యాయమూర్తి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆక్రమణలు తొలగించాలని మునిసిపల్ కమిషనర్ ఎం.గోపాలరావును ఆదేశించారు. ఆ మేరకు కమిషనర్ శుక్రవారం తన సిబ్బందితో దుకాణాలు, జ్యూస్ బండ్లను తొలగించారు. తిరిగి దుకాణాలు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టీడీపీవో సుజనకుమారి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు పామర్తి జితేంద్ర, బండి కిరణ్, సచివాలయ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్టీసీ కార్మికుల నిరసన

అవనిగడ్డ: అవనిగడ్డ ఆర్టీసీ డిపోలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం కార్మికులు ఎర్ర బాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. ఏపీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు అక్రమ చార్జీ షీట్‌లు, అక్రమ పనిష్మెంట్‌లు వెంటనే రద్దు చేయాలని, స్పేర్ ఉన్నవారితో బలవంతంగా లీవులు రాయించుకునేందుకు స్వస్తి పలకాలన్నారు. సకాలంలో బస్సులను డ్యూటీకి ఇప్పించాలని, బస్సుల కండిషన్ మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. డిపో కార్యదర్శి ఎం.మోహేశ్వరరావు, ఎన్.మోహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపుబెల్‌పేట - గిలకలదిండి వంతెన నిర్మాణం
పనులను పరిశీలించిన పీఆర్ డీఈ నగేష్

మచిలీపట్నం టౌన్: క్యాంపుబెల్‌పేట, గిలకలదిండిలను అనుసంధానం చేస్తూ రూ. 4కోట్లతో వంతెనతోపాటు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. శుక్రవారం పంచాయతీ రాజ్ డీఈ నగేష్ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ గ్రామసర్పంచ్ వల్లభుని నాగుల్‌మీరా, వడ్డి కాసులు, రాము, బత్తిన నాగరాజు, మాణిక్యాలరావు, నాగేంద్రం, వాసు, కొండలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి
డీపీటీవో వాణిశ్రీ

చల్లపల్లి : చల్లపల్లి బస్టాండ్‌లో ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారిణి వి.వాణిశ్రీ అన్నారు. చల్లపల్లి బస్టాండ్‌లోని ఆర్టీసీ కార్గో కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ, తక్కువ ఖర్చుతో నాణ్యమైన, వేగవంతమైన సేవలు ఆర్టీసీ కార్గో ద్వారా అందిస్తున్నామన్నారు. వ్యాపార సంస్థల యజమానులు, ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

పశువైద్య శిబిరాలతో రైతుకు మేలు

మోపిదేవి : పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను ప్రతీ ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని గ్రామసర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు కోరారు. కొక్కిలిగడ్డలో శుక్రవారం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ఎంపీటీసీ సభ్యురాలు దిడ్ల రాణి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావులతో కలసి ప్రారంభించారు. 75 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పశువైద్యాధికారి డాక్టర్ నంద కిషోర్, సిబ్బంది సేవలు అందించారు.

పెడన రూరల్ : పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులను ఎప్పటికప్పుడు గుర్తించి తగు చికిత్సచేయించాలనా పశు వైద్యశాఖ ఏడీ కె.బాబూరావు అన్నారు. కొప్పల్లి, చెన్నూరులో జరిగిన ఉచిత పశు వైద్యశిబిరంలో కొప్పల్లిలో156, చెన్నూరులో 440 పశువులకు సేవలందించారు. శమన్ బ్యాంక్(గన్నవరం) డాక్టర్ హరిత, పశు వైద్యాధికారి ఎం.అల్తాఫ్ హుస్సేన్, ఎ.వెంకటేశ్వరరావు, సూరిబాబు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యసంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మొగిలేశ్వరగుప్తా

చల్లపల్లి : కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడిగా విస్సంశెట్టి మొగిలేశ్వర గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు సన్నిధి నాగసాయి శ్రీనివాస్(సాయి) నియామక ఉత్తర్వులు అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందు ఉండే గుప్తా ఉపాధ్యక్షుడిగా నియమితులు కావటంపై పలువురు అభినందించారు. ఎస్సై పి.ఎన్.వి.సుబ్రహ్మణ్యం, విశ్రాంత డీఎస్పీ కె.హరిరాజేంద్రబాబు, జనసేన నేతలు అడపా రాంబాబు, గంగిశెట్టి రాజేంద్ర, ఎం.రంజిత్‌కుమార్, ఉరిమి మణికాంత్, ఆర్యవైశ్య సంఘం నేతలు పాల్గొన్నారు.

డబ్ల్యూసీఆర్‌పీ జిల్లా అధ్యక్షుడిగా చిన్నా

పెడన : పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ (డబ్ల్యూసీఆర్‌పీ) కృష్ణాజిల్లా చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారు. ఈ సందర్భంగా సత్యనారాయణను ఆర్యవైశ్య సంఘాలు అభినందించాయి.

రెండో రోజు కొనసాగిన ఆటల పోటీలు

నాగాయలంక: తలగడదీవి జడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా సెకండరీ స్కూల్ గేమ్స్, స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవనిగడ్డ సబ్ జోన్ బాలుర ఆటల పోటీలు రెండో రోజు శుక్రవారం జూనియర్ విభాగంలో జరిగాయి. 85 జట్లు పాల్గొన్నాయి. జూనియర్ విభాగంలో కబడ్డీ, ఖో-ఖో, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, షటిల్, చెస్, సాఫ్ట్‌బాల్ ఈవెంట్లలో విద్యార్థులు ఆడి తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. సబ్ జోన్ ఆటల పోటీలు అధ్యక్షుడు బి.శివరామ ప్రసాద్, కార్యదర్శి సి.హెచ్.వి.సుబ్బారావు పర్యవేక్షించగా, పీడీలు జి.మారుతి, కె.పూర్ణచంద్రరావు, టి.ఎస్.రత్నకుమారి ఆటలు ఆడించారు.

బందరును సుందరీకరణ చేద్దాం

●ప్రతి ఇంటి నుంచి విధిగా చెత్తను సేకరించాలి ● తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలి : కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్ , జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సుందర బందరు దిశగా ప్రతి ఒక్క పౌరుడు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఆరోగ్య వంతమైన సమాజం నిర్మించేందుకు సహకరించాలని కలెక్టర్ డి.కె.బాలాజీ పిలుపు నిచ్చారు. 45, 46 డివిజన్‌లలో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్తను విడివిడిగా పారిశుధ్య కార్మికులకు ఇస్తున్నారా? లేదా? అని అడిగారు. పారిశుధ్య కార్మికులకు వేర్వేరుగా చెత్త ఇవ్వాలన్నారు. 46వ డివిజన్‌లో రోడ్డుపై చెత్త ఉండటాన్ని కలెక్టర్ చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై వాస్తవాలను తెలుసుకోవాలని మునిసిపల్ కమిషనర్ బాపిరాజును ఆదేశించారు. కోర్టు రోడ్డుకు వెళ్లే దారిలోని డ్రైన్‌ను పరిశీలించారు. పక్కన ఉన్న ఆక్రమణలను తొలగించాలని డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, మునిసిపల్ అధికారులను ఆదేశించారు. సబ్‌జైలు నుంచి వచ్చే మురుగు నీరు చెరువులాగా కాకుండా తూముల సాయంతో సాధారణ డ్రైన్లలోకి మరల్చాలన్నారు. డ్రైన్లలో మురుగు పారకుండా ఉండటాన్ని కలెక్టర్ పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈడేపల్లిలో ఒక మహిళ తన ఇంటిలోని తడి చెత్త, ఎండిన ఆకులను ఎరువుగా మొక్కలను వినియోగిస్తున్న తీరును చూసి కలెక్టర్ ఆమెను అభినందించారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, పి.వి.ఫణికుమార్, ఐ.దిలీప్, వాలిశెట్టి తిరుమల రావు పాల్గొన్నారు.



45వ డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణపై కలెక్టర్ బాలాజీ పరిశీలన

చిన్నారుల పట్ల అశ్రద్ధ వద్దు : కలెక్టర్

కోడూరు: అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారుల విషయంలో అశ్రద్ధ వద్దని, పోషకాహారాన్ని క్రమపద్ధతిలో అందించాలని కలెక్టర్ డి.కె.బాలాజీ తెలిపారు. కోడూరు మండలంలో కలెక్టర్ శుక్రవారం పర్యటించారు. ఉల్లిపాలెం ఎస్సీవాడలోని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పోషకాహార నిల్వ, వంటశాలను రికార్డులను, గ్రోత్ రిజిస్టర్లను పరిశీలించారు. రిజిస్టర్‌లో నమోదైన పిల్లలు కాకుండా వేరే పిల్లలు ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై సీడీపీవో శేషుకుమారి, సూపర్‌వైజర్ రాజరాజేశ్వరీ, అంగన్వాడీ టీచర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ అందించి రిజిస్టర్‌లో ఉన్న పిల్లలు తప్పనిసరిగా కేంద్రానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఉల్లిపాలెం ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేసి, విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయంలో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగుల పట్ల నిర్లక్ష్యం చూపరాదన్నారు. తహసీల్దార్ శ్రీను నాయక్, మార్కెటింగ్ ఏడీనిత్యానందం, మార్క్‌ఫెడ్ డీఎం మురళీకృష్ణ, డీడీ మహ్మద్ హజీద్ బేగ్, ఎంఈవో టివి.ఎం.రామదాసు, శ్రీనివాసరావు, ఆర్ఐ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించండి

మచిలీపట్నం టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికులకు బడ్జెట్‌లో సరైన ప్రాధాన్యత కల్పించాలంటూ శుక్రవారం చేనేత శాఖ ఏడీ కార్యాలయం వద్ద చేనేత కార్మికులు ధర్నా నిర్వహించారు. కృష్ణాజిల్లా చేనేత కార్మిక సంఘ కార్యదర్శి గోరు రాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ, జీఎస్టీ విధించడం వల్ల చేనేత రంగం సంక్షోభంలో పడిందన్నారు. వైసీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం కింద కార్మికులకు షెడ్లు నిర్మించలేదన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంటు అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, దానిని అమలు చేసి చేనేత కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పి.నరసింహారావు, వి.గంగాధర్, వి.లింగం, చంద్రకళ, జి. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



ఏడీ కార్యాలయం వద్ద చేనేత కార్మికుల ధర్నా

ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగులకు న్యాయం చేయండి
కేడీసీసీ బ్యాంకు వద్ద సంఘ నాయకుల ధర్నా

మచిలీపట్నం టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : చీఫ్ మేనేజర్ల పదోన్నతులు కల్పించడంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగులకు సరైన న్యాయం జరగలేదంటూ శుక్రవారం కేడీసీసీ బ్యాంకు వద్ద సంఘ నాయకులు ధర్నా నిర్వహించారు. శిబిరాన్ని గన్నవరం ఎమ్మెల్యే, కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకట్రావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చుల బోసుబాబు సందర్శించారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం సంఘ నాయకులు కేడీసీసీబీ అధికారులకు, జాయింట్ కలెక్టర్ పేషీలో వినతిపత్రాలు సమర్పించారు. ధర్నాలో రాష్ట్ర సంఘ డిప్యూటీ జనరల్ సెక్రటరీలు కొండల రమేష్, కుమార్ నాయకత్వం వహించారు. జిల్లా అధ్యక్షురాలు ఎస్.లీలావతి, సలహాదారుడు డి. అజయకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి డి. గౌతమినాయక్, కోశాధికారి బాలచైతన్య పాల్గొన్నారు.



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న హెచ్‌ఈపీసీ సభ్యులు

పెడన, గూడూరు మండలాల్లో హెచ్‌ఈపీసీ సభ్యుల పర్యటన

పెడన, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పెడన పట్టణం, గూడూరు మండలంలోని చేనేత సహకార సంఘాలు, మాస్టర్ వీవర్లు ఉత్పత్తి చేస్తున్న చేనేత వస్త్రాలను హ్యాండ్లూమ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్(హెచ్‌ఈపీసీ) సభ్యులు శుక్రవారం పరిశీలించారు. చేనేత వస్త్రాలను ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హెచ్‌ఈపీసీ నడుస్తోంది. ఈ కౌన్సిల్ సభ్యులు పెడనలోని మణికంఠ, సదాశివలింగేశ్వర, గూడూరు మండలంలోని పోలవరం, పోలవరం మహాత్మాజీ చేనేత సహకార సంఘాలను సందర్శించి సంఘాలు ఉత్పత్తి చేస్తున్న చేనేత వస్త్రాలను పరిశీలించారు. చేనేత వస్త్ర ఎగుమతులను ప్రోత్సహించేందుకు కౌన్సిల్ కృషి చేస్తోందని చీఫ్ ఎన్. శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సుందర్, చేనేత, జౌళిశాఖ సంయుక్త సంచాలకుడు కె.కన్నబాబు, ఉపసంచాలకుడు బి.నాగేశ్వరరావు, ఆప్కో ఎండీ పవనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

కోడూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కోట రాఘవయ్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కొరివి అనిల్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఓపెన్, స్కూల్ స్థాయిలో విద్యా సంస్థల ప్రాంగణంలో జరుగుతాయన్నారు. ఓపెన్ స్థాయిలో మొదటి బహుమతిగా రూ.5 వేలు, రెండో బహుమతి రూ.3 వేలు, స్కూల్ స్థాయిలో మొదటి బహుమతి రూ.2 వేలు, రెండో బహుమతి రూ.1000 అందించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు పాఠశాల గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. ఆసక్తి గల వారు 8639413241, 9505945571లలో సంప్రదించాలన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

మచిలీపట్నం టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : యుక్త వయసులో ఉన్న బాలికలు ఏదైనా ఆపద వచ్చినప్పుడు స్వశక్తితో ఎదుర్కొవాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉషా అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎన్.శ్రావణి విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉషా మాట్లాడుతూ, బాలికల ఆలోచనా సరళిని కాలానుగుణంగా మార్చుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు. ఫార్మసీ కళాశాల విభాగ అధిపతి ఆచార్య మారుతి మాట్లాడుతూ, మహిళల్లో పెరుగుతున్న చైతన్యానికి కేకూఒక వేదిక కావాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్ఎస్ఎస్ విభాగ సమన్వయకర్త డాక్టర్ శ్రావణి, హాజరైన విద్యార్థినులు

చల్లపల్లి: జాతీయ బాలికా దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ లక్ష్మీపురం సెక్టారులోని నూకలవారిపాలెం గ్రామానికి చెందిన అంగన్వాడీ కార్యకర్త చలమలశెట్టి కామాక్షీదేవి పలు పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఆడపిల్ల ప్రాముఖ్యతను తెలియచేయటంతోపాటు, సమాజంలో వివక్షతను ఎలా ఎదుర్కోవాలి, ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగటం, బాలికావిద్య తదితర అంశాలపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల గురించి తెలియజేశారు. వికసిత్ భారత్ ప్రాధాన్యతాంశాలను వివరించారు. విద్యార్థినిలతో మానవహారం ఏర్పాటుచేశారు. శివరామదుర్గాపురం పాఠశాల, లక్ష్మీపురం ఎంపీయూపీ పాఠశాల, చల్లపల్లి రాజా హైస్కూల్‌లో కార్యక్రమాలు నిర్వహించారు. టీచర్లు వేములపల్లి శోభారాణి, లలితారత్నం తదితరులు పాల్గొన్నారు.

వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో జేఈఈ మెయిన్స్-2025

పెడన రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో జేఈఈ మెయిన్స్ 2025 పరీక్షల నిర్వాహణ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 164 మందికిగాను 162 మంది, మధ్యాహ్నం 142 మంది గాను 139 మంది అభ్యర్థులు హజరయ్యారని పరీక్షా కేంద్ర నిర్వాహకులు పి.అశోక్‌కుమార్ తెలిపారు.

రిపబ్లిక్ డేకు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయండి : ఆర్డీవో

మచిలీపట్నం టౌన్: రి పబ్లిక్ డే సందర్భంగా విద్యార్థులతో పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో దేశభక్తిగీతాలతో కూడిన సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని ఆర్డీవో స్వాతి సూచించారు. రుస్తుంబాద బాలికల మునిసిపల్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. డీవైఈవో శేఖర్‌సింగ్‌తో రిపబ్లిక్‌డే సాంస్కృతిక కార్యక్రమాలపై చర్చించారు. ఎనిమిది పాఠశాలల విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. వాటిలో మెరుగైన ప్రదర్శనలను ఎంపిక చేయాలని డీవైఈవోకు సూచించారు.

నేడు జాతీయ ఓటరు దినోత్సవం

పెడన : పట్టణంలోని భట్ట జ్ఞానకోటయ్య జడ్పీ హైస్కూల్‌లో శనివారం ఉదయం 9 గంటలకు జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ, సీనియర్ ఓటర్లకు సన్మానం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్‌టీవోకు గాయాలు

అవనిగడ్డ రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ సబ్ ట్రెజరీ అధికారిగా పనిచేస్తున్న ఉప్పాల ఆదిశేషును లారీ ఢీకొనడంతో గాయపడ్డాడు. రేపల్లెలో నివాసముంటున్న ఆదిశేషు విధి నిర్వహణలో భాగంగా అవనిగడ్డ వస్తుండగా పులిగడ్డ - పెనుమూడి వారధిపై లారీ ఢీకొనటంతో గాయాలయ్యాయి. సహచర ఉద్యోగులకు సమాచారం ఇవ్వటంతో ఆదిశేషును రేపల్లెలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు.

సేఫ్టీ యాప్‌ను ప్రతి మహిళ ఉపయోగించుకోవాలి

మచిలీపట్నం టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఉమెన్ సేఫ్టీ యాప్‌ను ప్రతి మహిళ వినియోగించుకోవాలని ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. మహిళా పోలీసు స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళలు, చిన్నారుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉమెన్ సేఫ్టీ యాప్‌ను మహిళలందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. వ్యాపార సముదాయాలు, మహిళా వసతి గృహాలు మహిళలకు యాప్ ప్రాముఖ్యత తెలియజేయాలన్నారు. ఒంటరిగా, రాత్రిపూట ప్రయాణం చేస్తున్న మహిళలు ఈ యాప్‌ను ఉపయోగించుకోవచ్చన్నారు.

సముద్రంలో గల్లంతయిన వ్యక్తి కుటుంబానికి భరోసా

నాగాయలంక: పాత ఉపకాలి గ్రామానికి చెందిన మత్స్యకారుడు కోలా నాంచారయ్య నాలుగు రోజుల క్రితం గుల్లలమోద సముద్ర తీర ప్రాంతంలో వేటకు వెళ్లి గల్లంతైన విషయం విదితమే. అతని మృతదేహం ఇంకా లభ్యం కాకపోవటంతో తీవ్ర ఆందోళన చెందవుతున్న వారి కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు పరామర్శించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎక్స్‌గ్రేషియా అందేలా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలసి మాట్లాడతానని కుటుంబసభ్యులకు హామీ ఇచ్చారు. రేవు సువర్ణరాజు, మత్స్యకార నేతలు పాల్గొన్నారు.

గుడివాడ

● గుడివాడ ● పామర్రు

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 490

ఉపాధి పనులు త్వరగా పూర్తి చేయాలి: ఎంపీడీవో



ప్రసంగిస్తున్న ఎంపీడీవో వై.విష్ణుప్రసాద్

గుడివాడ రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో డివై.విష్ణుప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి పనులు ప్రారంభించాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రతీ రోజు వచ్చిన కూలీలకు మస్తర్లు తప్పనిసరిగా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతకు అభినందనలు



గుడ్లవల్లేరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల విద్యార్థిని ఎండీ షైమున్నీసా (ఫార్మశీ మొదటి సంవత్సరం) మంగళగిరి నిర్మలా ఫార్మశీ కళాశాల నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సులో ఈ-పోస్టర్ ప్రజంటేషన్‌లో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవశం చేసుకుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. షైమున్నీసాను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు డాక్టర్ ఎస్‌కె.అమీనా బీ, డాక్టర్ రవీష, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ టి.బాలకృష్ణ, బి.సత్యశ్రీ, టి.శ్రావణి, డాక్టర్ వి.రజని అభినందించారు.

వేములమడ చెరువులో గుర్రపుడెక్క తొలగించాలి

కూచిపూడి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వేములమడ గ్రామ చెరువులో గుర్రపు డెక్క అల్లుకుపోయి నీరు కలుషితమైందని గ్రామపంచాయతీ వెంటనే తొలగించాలని సీపీఎం మండల కార్యదర్శి శీలం నారాయణరావు, పలువురు గ్రామస్థులు డిమాండ్ చేశారు. చెరువులో నీరు కలుషితమై పశువులకు రోగాలు ప్రబలటంతో పాల ఉత్పత్తి తగ్గిపోయిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జన్ను నాగేశ్వరరావు, బల్లా సుబ్రహ్మణ్యం, నూకల వెంకటేశ్వరరావు, రాధా కృష్ణమూర్తి తదితరులు కోరారు.

నేత్రదానం



హైమావతి (ఫైల్ ఫొటో)

గుడివాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సత్యనారాయణపురంకు చెందిన వల్లూరి హైమావతి(68) రెండు నేత్రాలను విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్‌లు శుక్రవారం సేకరించారు. హైమావతి గుండెపోటుతో మృతి చెందడంతో ఆమె కుటుంబసభ్యుల అనుమతితో కొనకళ్ళ సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొనకళ్ళ సీతయ్య ఆధ్వర్యంలో నేత్రదానం జరిగింది.

సిమెంట్ బల్లలు, కుర్చీల వితరణ

కూచిపూడి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కూచిపూడిలో ఆరోగ్య ఉప కేంద్రానికి దాతల సహకారంతో మూడు సిమెంట్ బల్లలు, కుర్చీలు వితరణగా అందజేశారు. మాజీ సర్పంచ్ వైకె.డి.ప్రసాదరావు కుమారులు, హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు ఆర్థిక సహకారంతో వీటిని సమకూర్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొండవీటి అమల బాలేశ్వరరావు, కావూరి పూర్ణచంద్ర శర్మ, కాటూరి శ్రీకాంత్, మద్దాల కామేశ్వరరావు, ఐనంపూడి శివరామప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా కర్పూర్ ఠాగూర్ జయంతి



ఠాగూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణ, సత్యసాయి తదితరులు

గుడివాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బంటుమిల్లి రోడ్డులోని నాగన్న సత్రం కళ్యాణ మండపంలో శ్రీసాయి నాయీ బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర నాయకుడు దేవరపల్లి కోటి ఆధ్వర్యంలో శుక్రవారం కర్పూర్ ఠాగూర్ 101వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోదరుడు రామకృష్ణ(నాని), టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయిలు తొలుత కర్పూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు వడ్డాది ప్రసాద్, మాతాజీ, అధ్యక్షకార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

గుడివాడ-కంకిపాడు రహదారి నిర్మించాలి

గుడివాడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : గుడివాడ -కంకిపాడు రహదారిని వెంటనే నిర్మించాలని, నలుగురు ఎమ్మెల్యేలు రహదారి విషయాన్ని పట్టించుకోకపోవడం దారుణమని సీపీఎం నాయకులు ఆర్‌సీపీ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక రహదారుల మరమ్మతులకు రూ.600కోట్లు కేటాయించారని, కానీ గుడివాడ-కంకిపాడు రహదారికి మరమ్మతులను చేయకపోవడం దారుణమని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు రేపాని కొండ పాల్గొన్నారు.

కెరీర్ పురోగతికి వృత్తివిద్యా కోర్సులు

గుడివాడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత కాలంలో కెరీర్ పురోగతి చెందాలంటే విద్యార్థులు డిగ్రీతో పాటు వృత్తి విద్యా కోర్సులను ఎన్నుకోవాలని సీఆర్ రెడ్డి కాలేజ్ ఆఫ్ అటానమస్ కామర్స్ విభాగాధిపతి బి.వి.ఆర్ ఫణికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఏఎన్‌ఆర్ కళాశాలలో కెరీర్ పురోగతికి సంబంధించిన అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సుకు అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షకార్యదర్శులు ఎల్‌ఆర్‌కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ డా.పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి డా.సువర్చల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వాహనాలు నడపొద్దు

గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ



మాట్లాడుతున్న గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ

గుడ్లవల్లేరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మనిషికి జీవితం భగవంతుడు ఇచ్చిన ఒక వరం. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి విలువైన జీవితాన్ని అంతమొందించకోవద్దని గుడ్లవల్లేరు ఎస్సై ఎస్.వి.వి సత్యనారాయణ హితవు పలికారు. శుక్రవారం స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో కాలేజీ బస్‌డ్రైవర్లు, క్లీనర్లకు జాతీయ రహదారి భద్రతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల భద్రత కోసం ప్రభుత్వ ఉద్దేశించిన నియమాలను అతిక్రమించిన వారికి జరిమానా విధిస్తారని, కొన్ని సందర్భాల్లో శిక్షలు కూడా విధించే అవకాశం ఉందన్నారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండరామారావు, సూపర్‌వైజర్ కె.విజయకుమర్ పాల్గొన్నారు.

జనార్థనపురంలో..

నందివాడ: జనార్థనపురంలో ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆటో డ్రైవర్లు, వాహనదారులకు రోడ్డు భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆటోడ్రైవర్లు, వాహనదారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న సీడీపీవో భానుశ్రీ



మాట్లాడుతున్న ఐద్వా కార్యదర్శి రజని



మోటూరు ఉన్నత పాఠశాల వద్ద ర్యాలీ

బాలికల రక్షణ అందరి బాధ్యత



మొవ్వ జడ్పీ పాఠశాలలో

పామర్రు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలికలు లేని సమాజాన్ని ఊహించలేమని, మానవాళి మనుగడకు బాలికల వృద్ధి అవసరమని, బాలికల రక్షణ అందరి బాధ్యత అని పామర్రు శిశుసంక్షేమ శాఖ అధికారిణి సి.భానుశ్రీ తెలిపారు. జాతీయ బాలికాల దినోత్సవం సందర్భంగా శుక్రవారం జమిగోల్వేపల్లి జడ్పీ పాఠశాలలో పలు కార్యక్రమలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆడపిల్లలనే వివక్షత చూపకుండా వారిని పాఠశాలల్లో చేర్పించి విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించడం ద్వారా సమాజ ప్రగతి సాధ్యపడుతుందన్నారు. ఆడపిల్లలకు ప్రభుత్వాలు అమలు పరుస్తున్న చట్టాల పట్ల అవగాహన ఉండాలన్నారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు పాల్పడే మానవ మృగాళ్లకు కేవలం 21రోజుల్లో శిక్ష విధించేలా ప్రత్యేక చట్టాలు అమల్లోకి వచ్చాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా రక్షణ చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకుని గ్రామాల్లో మహిళలకు వివరించాలని కోరారు. మహిళలకు, బాలికలకు అనుకోని ఆపదలు ఎదురైతే టోల్ ఫ్రీ 112కి డయల్ చేయాలన్నారు. బాల్య వివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణ కోసం ప్రతి ఇంటా రెండు పచ్చని మొక్కలను నాటి సంరక్షించాలని ఆకాంక్షించారు. ఆమె పచ్చని మొక్క నాటారు. అనంతరం ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాల సూపర్‌వైజర్ విజయకుమారి, టీచర్లు, తల్లులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడివాడ : స్థానిక ఓల్డ్ టౌన్ ప్రాథమికోన్నత పాఠశాలలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో సంఘ సహాయ కార్యదర్శి చోడవరపు రూప అధ్యక్షతన అంతర్జాతీయ విద్యా దినోత్సవం, జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా కార్యదర్శి పి.రజిని, సాహితీ స్రవంతి అధ్యక్షులు లంకా సురేంద్రలు మాట్లాడుతూ బాలికలు, మహిళలపై అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.నాగమణి, ఉపాధ్యాయులు, భాగ్యలక్ష్మీ, సౌజన్య, తాహిరున్నీసా, నాగకుమారి, షర్మిల, గీతా మహాలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** గుడ్లవల్లేరు శ్రీ సాయి విద్యానికేతన్ విద్యార్థినులు, ఉపాధ్యాయినులు బాలికా సంరక్షణ కోరుతూ ప్రదర్శన చేశారు. కరస్పాండెంట్ సింగంశెట్టి ఆదినారాయణ (చినమాస్టారు), ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు. **గుడివాడ రూరల్:** గుడివాడ రూరల్ మండలం మోటూరు సెక్టార్‌లో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, మోటూరు ఉన్నత పాఠశాల విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కౌమార దశలో బాలబాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలు వివరిస్తూ మోటూరులో ర్యాలీ నిర్వమించారు.



వెన్ననపూడిలో సైకిల్ ర్యాలీ

కూచిపూడి: జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సుధారాణి మొవ్వ జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ జరిగింది. సూపర్‌వైజర్ పుణ్యవతి, అంగన్‌వాడీలు గోపి, లక్ష్మీ, నాగమణి, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

నందివాడ: మండలంలోని తుమ్మలపల్లి, విరివాడ, వెంకట రామాపురం, వెన్ననపూడి అంగన్‌వాడీ సిబ్బంది శుక్రవారం వెన్ననపూడి జిల్లా పరిషత్ విద్యార్థులు గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సెక్టారు సూపర్‌వైజర్ ఎన్.నాగ శిరీష, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదపారుపూడి: వెంట్రప్రగడ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.శివనాగరాణి మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని వారికున్న హక్కులను ఉపయోగించుకోవాలని అన్నారు. మహిళా పోలీసులు, టీచర్లు, హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు కిషోర్, బాలికలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఎం.శివనాగమణి

స్వచ్ఛాంధ్రలో గుడివాడకు ప్రాధాన్యత కల్పిస్తాం

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న పట్టాభి, వెనిగండ్ల, మున్సిపల్ అధికారులు

గుడివాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గుడివాడకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చేస్తున్న కృషికి తాను పూర్తిగా సహకార మందిస్తానని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి అన్నారు. శుక్రవారం ఆయన గుడివాడలో పర్యటించారు. తొలుత పట్టాభికి స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మున్సిపల్ అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం చెత్త సేకరించే విధానం, డంపింగ్ యార్డు విస్తీర్ణం, యార్డులో పేరుకుపోయిన చెత్త నిల్వల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో నెలకొన్న సమస్యలు, పురపాలక సంఘానికి కావలసిన వనరులపై పట్టాభికి ఎమ్మెల్యే వెనిగండ్ల వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టాభి మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యక్రమాల్లో గుడివాడకు ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ పట్టాభి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కావడం హర్షణీయమన్నారు. అనంతరం నందివాడ మండలం జనార్ధనపురంలోని డంపింగ్ యార్డును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సీనియర్ ఫైనాన్స్ మేనేజర్ విజయ్‌ప్రసాద్, మున్సిపల్ ఇంజినీర్ వరప్రసాద్, టీపీవో ఏసుబాబు,ఏవో, టీడీపీ నేతలు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు, పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్

పెదపారుపూడి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. శుక్రవారం వెంట్రప్రగడ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.6 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజకవర్గంలో 400 రోడ్లను నిర్మించినట్లు తెలిపారు. మరో 3 సీసీ రోడ్లకు త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్‌చౌదరి, మసిముక్కు రాంబాబు, మాజీ ఎంపీపీ పునుకొల్లు వెంకటరత్న ప్రసాద్, కూచిపూడి సుబ్బయ్య, గొరిపర్తి రవికుమార్, జాజుల ప్రసాద్, మండల జనసేన పార్టీ అధ్యక్షులు సురేష్, బుడ్డాలు, దానబోయిన వెంకట నారాయణ, తహసీల్దార్ రంగారావు, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఈవోపీఆర్‌డీ వంగ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం

వెంట్రప్రగడ కళ్యాణ మండపంలో జరిగిన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలందరినీ కలుపుకుని పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రమేష్ చౌదరి (చంటి), ప్రధాన కార్యదర్శి రాంబాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పోలిశెట్టి సురేష్, లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ సుబ్బయ్య, నీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయండి

● పామర్రు నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి రమేష్



మాట్లాడుతున్న ఎన్నికల ఎలక్టోరల్ అధికారి రమేష్

పామర్రు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పామర్రు నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి జి.రమేష్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సహాయ ఎన్నికల అధికార్లు, బూత్‌స్థాయి అధికార్లు, పర్యవేక్షణ అధికార్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఓటర్ నమోదుపెంపు, ఎథికల్ ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు ఏటా జనవరి 25న ఓటరు దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. పామర్రు నియోజకవర్గంలో అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో ప్రతి బూత్‌స్థాయి అధికారి నూతన ఓటర్లకు ఓటు కార్డులను పంపిణీ చేయాలని, కొత్త ఓటర్ల నమోదుతోపాటు గ్రామాల్లో ఎంపిక చేసిన నూతన ఓటర్లతో పాటు సీనియర్ ఓటర్లను సన్మానించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గూడపాటి రవికాంత్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ బత్తుల రజనీకాంత్, ఆర్ఐ రాము తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం కోరుతూ పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభం



గుడివాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ-కంకిపాడు రహదారి నిర్మాణం చేయాలని కోరుతూ పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించినట్లు భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు వై.వి మురళీకృష్ణ తెలిపారు. భద్రతా దళం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో అన్నివర్గాల ప్రజలను కలిసి పోస్టుకార్డు ఉద్యమంలో భాగస్వాములు కావాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడ-కంకిపాడు రహదారి గోతులమయంగా మారడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.20లక్షలు, గాయపడిన వారికి రూ.5లక్షల చొప్పున ఆర్ అండ్ బి శాఖ చెల్లించాలని డిమాండ్ చేశారు. రహదారి నిర్మించేలా ఆ శాఖకు ఆదేశాలివ్వాలని కోరుతూ 2022 నవంబరు 23న రాష్ట్ర హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసినట్లు తెలిపారు. దాఖలు చేసిన పిల్‌ను త్వరగా విచారణ జరపాలని హైకోర్టు న్యాయమూర్తిని పోస్టుకార్డుల ద్వారా కోరుతున్నట్లు ఆయన తెలిపారు.

మోటూరు- సెర్విగొల్వేపల్లి రహదారి గోతులమయం



సెరిగొల్వేపల్లి వద్ద తిరగబడిన లారీ

గుడివాడ రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండలం మోటూరు నుంచి సెర్విగొల్వేపల్లి వెళ్లే రహదారి పూర్తిగా గుంతల మయంగా ఉండటంతో ప్రయాణీకులు భయాందోళన చెందుతున్నారు. పెద్ద గుంతలు, తారు రోడ్డు లేచిపోయి ఉండటం వల్ల వాహనాలు వెళ్తే దుమ్ము, ధూళి లేచి ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనపడకపోవటంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. గుడివాడ నుంచి మోటూరు మీదుగా సెరిగొల్వేపల్లి, రుద్రపాక వరకు ఇది ప్రధాన రహదారి. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారి మీదుగా వెళ్తున్నాయి. అధికారులు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. శుక్రవారం ఉదయం సెరిగొల్వేపల్లి వద్ద లోడుతో ఉన్న లారీ గోతులో దిగి పక్కన బోదులో అదుపు తప్పి బోల్తా కొట్టింది. లారీ లోడుతో ఉండటంతో చాలా నష్టం వాటిల్లింది. చేపల మేతకు, రొయ్యల మేతకు గొల్వేపల్లి, రుద్రపాక గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు ప్రతీ రోజు గుడివాడ వెళ్తారు. ముఖ్యంగా రాత్రి వేళ ప్రయాణం చేయాలంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మంత్రి కొల్లును కలిసిన బీజేపీ నాయకులు

మర్యాదపూర్వక కలయిక

గుడివాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను గుడివాడ బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం విజయవాడలోని మంత్రి కొల్లు కార్యాలయంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వలపర్ల వెంకటేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, నాయకులు సంగటి త్రినాథ్, టీడీపీ నాయకులు రామదేను వేణుబాబు తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.